జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

రంగారెడ్డి | గురువారం 19 జూన్ 2025 | సంపుటి : 15 | సంచిక : 279 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com



## ఫాస్టాగ్ వార్షిక పాస్..
# ఇదో గేమ్ ఛేంజర్

- పవన్ కల్యాణ్ ట్వీట్
- ఈ నిర్ణయంతో ఫాస్టాగ్ వార్షిక పాస్ తీసుకురావాలన్న ప్రయాణికుల దీర్ఘకాలిక డిమాండ్‌కు పరిష్కారం లభించినట్లవుతుంది
- ప్రయాణ ఖర్చులను గణనీయంగా తగ్గించడం ద్వారా ప్రైవేటు వాహన యజమానులకు ఉపశమనం

## హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లల్లో
# వేగం పెంచండి

- పంట ఉత్పత్తుల్ని వాణిజ్య కోణంలోనే చూడాలి
- రైతులకు ఇబ్బంది కలగకుండా పంట ఉత్పత్తుల కొనుగోలు జరగాలి
- పంట వివరాలు, పర్యవేక్షణకు సాంకేతికత వినియోగించండి
- ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రైతులకు అండగా నిలవాలి
- ఎగుమతులు పెంచేందుకు అత్యుత్తమ గ్రేడింగ్ విధానాలు అమలు చేయండి
- మామిడి, పొగాకు, కోకో పంటల మద్ధతు ధరలపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు



**అమరావతి**

పొగాకు, మామిడి తదితర పంట ఉత్పత్తులకు సంబంధించి నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పంట ఉత్పత్తులను వాణిజ్య కోణంలోనే చూడాలని, వీలైనంత మెరుగైన ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సచివాలయంలో మామిడి, పొగాకు, కోకో పంటల మద్ధతు ధరతో పాటు వివిధ అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ ఏడాది హెచ్డీ బర్లీ పొగాకు 80 మిలియన్ కేజీల మేర ఉత్పత్తి వచ్చిందని సమీక్షలో అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇప్పటి వరకూ 27 మిలియన్ కేజీల మేర విక్రయాలు జరిగినట్టు అధికారులు తెలిపారు. మిగిలిన 53 మిలియన్ కేజీల హెచ్డీ బర్లి పొగాకును త్వరగా కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందులో 33 మిలియన్ కేజీల పొగాకును 24 కంపెనీల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నట్టు అధికారులు వివరించారు. మరో 20 మిలియన్ కేజీల మేర పొగాకును - మిగతా3లో



## కర్నూలులో హైకోర్టు బెంచ్‌కు సహకరించండి

- కేంద్రమంత్రిని కోరిన లోకేశ్
- " రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అక్కడి ప్రజల చిరకాల కోరిక.
- న్యాయపరమైన అవసరాల కోసం రాయలసీమ ప్రజలు ఏపీ రాజధానికి రావడానికి 500 కి.మీ పైగా ప్రయాణించాల్సి ఉంటుంది.




## ఇకపై హిందీ తప్పనిసరి కాదు

- ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు హిందీని మూడవ భాషగా తప్పనిసరిగా బోధించడాన్ని రద్దు
- ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ నూతన నోటిఫికేషన్ జారీ
- మహారాష్ట్ర పాఠశాలల్లో త్రిభాషా సూత్రం అమలు

# 'ఏపీలో అభివృద్ధి, సంక్షేమం ఏదీ లేదు



- కేవలం రెడ్‌బుక్ రాజ్యాంగం మాత్రమే నడుస్తోంది
- చంద్రబాబూ.. నాగమల్లేశ్వరరావు భార్యా, కూతురికి ఏం సమాధానం చెబుతారు?
- దారుణమైన పరిస్థితులు ఉన్నాయి అనడానికి ఆంక్షలే నిదర్శనం
- తమకు అనుకూలమైన పోలీసులను ఎన్నికల ఫలితాల వేళ నియమించుకున్నారు
- కూటమిని గెలిపించుకునేందుకు అన్యాయాలు చేశారు.

**పల్నాడు**

రాష్ట్రంలో ఎలాంటి దారుణమైన పరిస్థితులు ఉన్నాయో అనడానికి కోర్లకుంట వెంకటేశ్వరరావు కుటుంబానికి జరిగిన అన్యాయమే నిదర్శనమని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో పర్యటించిన ఆయన.. పోలీసుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరావు ఘటనను ప్రస్తావించారు. అంతకు ముందు.. నాగమల్లేశ్వరరావు విగ్రహాన్ని - మిగతా3లో



## మీ ప్రమేయం లేదు.. ఇక మీదట ఉండబోదు కూడా!

- పహల్గాం, ఆపరేషన్ సిందూర్ పరిణామాల సమయంలో భారత్-అమెరికా మధ్య ఏ స్థాయిలోనూ వాణిజ్య ఒప్పందం గురించి చర్చలు జరగలేదు
- భారత్-పాకిస్తాన్ మధ్య అమెరికా మధ్యవర్తిత్వానికి అంశంపైనా చర్చలు కూడా జరగలేదు
- కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి భారత్‌పాక్ మధ్య మిలిటరీ స్థాయి చర్చలు జరిగాయి.



## ఇరాన్‌లోని 1100 లక్ష్యాలను ధ్వంసం చేశాం

- ఇజ్రాయెల్ బలగాల ప్రకటన
- అణు ముప్పును తాము ఒక వ్యూహం ప్రకారం అణచివేస్తున్నాం
- 'మేం ఒక పద్ధతి ప్రకారం ఇరాన్‌లోని అణుముప్పును నాశనం చేస్తున్నాం
- మా దాడులు వారి నష్టాన్ని గణనీయంగా పెంచుతున్నాయి

## ప్రమాదానికి మూడు నెలల క్రితమే కొత్త ఇంజిన్.. రూ.4 వేల కోట్లకుపైగా బీమా!



## లొంగిపోయే ప్రసక్తే లేదు

- ఇరాన్ సుప్రీం లీడర్



# ఏలూరు జిల్లాలో ఆయిల్ ఫామ్‌కు ప్రోత్సాహం

- ఏలూరు జిల్లాలో 15 వేల హెక్టార్లలో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యం
- పెదవేగి ఆయిల్ పామ్ పరిశోధన కేంద్రంలో మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్ష
- రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు
- గత సర్కారు రూ.54 కోట్ల సబ్సిడీ బకాయిలు పెట్టిందన్న మంత్రి
- ఆయిల్ ఫామ్ సాగులో ఏపీని అగ్రగామిగా నిలుపుతామని వెల్లడి



**విజయవాడ**

ఏలూరు జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఈ ఏడాది జిల్లాలో 15 వేల హెక్టార్లలో ఆయిల్ ఫామ్ పంటను విస్తరించడమే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బుధవారం ఆయన పెదవేగిలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ పరిశోధన కేంద్రాన్ని (ఐఐఓపీఆర్) సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫామ్ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు, ఆయిల్ ఫామ్ కంపెనీల ప్రాసెసర్లతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయిల్ ఫామ్ పరిశోధన, అభివృద్ధి - మిగతా3లో

## నేనేం చేస్తానో ఎవరికీ తెలియదు

- ఇరాన్‌పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- ఇరాన్ హద్దులు మీరిందన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- ఇప్పటికే స్పందించడంలో ఆలస్యమైందని ట్రంప్ అభిప్రాయం
- వచ్చే వారం లేదా అంతకంటే ముందే కీలక పరిణామాలని సూచన
- ఇజ్రాయెల్-ఇరాన్ ఘర్షణలో జోక్యంపై ట్రంప్ అస్పష్టత



## ఫోన్ ట్యాపింగ్..
# ఆంధ్రా నేతలను వదల్లేదు



**విజయవాడ**

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అప్పట్లో ఏపీ నేతల ఫోన్లో కూడా ట్యాప్ చేసినట్లు తాజాగా సమాచారం అందుతోంది. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసునకు సంబంధించి ఎస్ఐబి మాజీ ఓఎస్డి ప్రభాకర్ రావును సిట్ అధికారులు విచారణ చేపడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఫోన్ ట్యాపింగు కేసులో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఫోన్లను సైతం అప్పట్లో ట్యాపింగ్ చేసినట్లు తెలియడం సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసు కొత్త మలుపునకు దారి తీసినట్లు అయ్యింది. అప్పట్లో కెసిఆర్ తో జగన్మోహన్ రెడ్డికి ఉన్న స్నేహం కారణంగానే చంద్రబాబు, లోకేష్ ను అప్పటి తెలంగాణ సర్కార్ టార్గెట్ చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఫోన్ ట్యాపింగు తెరపైకి వచ్చింది. అప్పట్లో కెసిఆర్ రాజకీయ ప్రత్యర్థులను వెంటాడారని.. అందులో కాంగ్రెస్ తో పాటు బిజెపి నేతలు బాధితులుగా మిగిలారన్న విమర్శలు ఉండేవి. ఈ నేపథ్యంలో తెలంగాణ - మిగతా3లో

# మీ ప్రమేయం లేదు.. ఇక మీదట ఉండబోదు కూడా!

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ షాకిచ్చారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ యుద్ధాన్ని తానే అడ్డుకున్నానని ట్రంప్ ప్రకటించుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈ ఇరు దేశాల ఉద్రిక్తతలు చల్లారడంలో ఎవరి ప్రమేయం లేదని.. ఇక మీదట కూడా ఉండబోదని ట్రంప్‌నకు ప్రధాని మోదీ స్పష్టం చేశారు. జీ-7 సదస్సు వేదికగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత ప్రధాని మోదీ భేటీ జరగాల్సి ఉంది. అయితే పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో తన పర్యటనను కుదించుకుని ట్రంప్ వెళ్లిపోయారు. ఈ తరుణంలో ఇరు దేశాల అధినేతలు ఫోన్ ద్వారా అరగంట మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి.. దానికి ప్రతిగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ వివరాలను మోదీ ట్రంప్‌కు వివరించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంలోనే..

మోదీ ట్రంప్‌తో మాట్లాడుతూ.. పహల్గాం, ఆపరేషన్ సిందూర్ పరిణామాల సమయంలో భారత్-అమెరికా మధ్య ఏ స్థాయిలోనూ వాణిజ్య ఒప్పందం గురించి చర్చలు జరగలేదు. భారత్-పాకిస్తాన్ మధ్య అమెరికా మధ్యవర్తిత్వానికి అంశంపైనా చర్చలు కూడా జరగలేదు. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి భారత్‌పాక్ మధ్య మిలిటరీ స్థాయి చర్చలు జరిగాయి. పాక్ అభ్యర్థన మేరకే 'ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేశాం. ఇప్పుడు, ఎప్పుడూ.. భారత్ ఇతరుల మధ్యవర్తిత్వాన్ని అంగీకరించబోదనే విషయాన్ని అమెరికా అధ్యక్షుడు



ట్రంప్‌నకు మోదీ స్పష్టంగా చెప్పారు. ఈ విషయంపై భారత్‌లో పూర్తి రాజకీయ ఏకాభిప్రాయం ఉందని అన్నారాయన. దీనికి ట్రంప్ ఉగ్రవాదంపై భారత్ జరిపే పోరునకు అమెరికా మద్ధతు ఉంటుందని తెలిపారు. ట్రంప్-మోదీ మధ్య ఫోన్ కాల్ సంభాషణ సారాంశాన్ని కేంద్ర విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు వివరించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఫోన్ కాల్ ద్వారా ట్రంప్ మోదీకి సంతాపం తెలియజేశారని, ఆ తర్వాత ఇద్దరూ మాట్లాడుకోవడం ఇదేనని మిస్రీ తెలిపారు. అయితే కెనడా పర్యటన ముగిచుకుని వెళ్లే క్రమంలో అమెరికాకు రావాలంటూ ట్రంప్ మోదీని ఆహ్వానించగా.. షెడ్యూల్ ప్రకారం తాను రాలేనని మోదీ తెలిపినట్లు సమాచారం. భారత్‌లో జరిగే క్వాడ్ తదుపరి సమావేశం కోసం ట్రంప్‌ను మోదీ ఆహ్వానించారు. దీన్ని అంగీకరించిన అమెరికా అధ్యక్షుడు.. భారత్‌లో పర్యటించేందుకు ఉత్సుకతతో ఉన్నానని తెలిపారు ఇదిలా ఉంటే.. భారత్-పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపినట్లు ట్రంప్ ప్రకటించుకోవడం భారత రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ట్రంప్ ప్రకటనపై స్పష్ట త ఇవ్వాలని ప్రతిపక్షాలు సైతం డిమాండ్ చేశాయి కూడా.

## ప్రమాదానికి మూడు నెలల క్రితమే కొత్త ఇంజిన్..

# రూ.4 వేల కోట్లకుపైగా బీమా..!

అహ్మదాబాద్‌లో గతవారం జరిగిన ఘోర విమాన ప్రమాద దర్యాప్తులో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ప్రమాదానికి గురైన ఎయిర్ ఇండియా ఫ్లైట్ ఏఐ 171 కుడివైపున ఉన్న ఇంజిన్‌ను మూడు నెలల క్రితమే ఓవర్ హాలింగ్ సమయంలో అమర్చినట్లు అధికారులు గుర్తించారు. . సుమారు 12 సంవత్సరాలుగా వినియోగంలో ఉన్న ఈ బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానానికి చివరిసారిగా జూన్ 2023లో నిర్వహణ పనులు చేపట్టారు. తదుపరి షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 2025లో నిర్వహించాల్సి ఉంది. ప్రమాదానికి గురైన విమానానికి సంబంధించిన బీమా వివరాలు చర్చనీయాంశంగా మారాయి. ఈ ప్రమాదం కారణంగా దేశ చరిత్రలోనే అతిపెద్ద విమాన బీమా క్లెయిమ్ నమోదయ్యే అవకాశం ఉందని అంచనా. ప్రమాదానికి గురైన ఈ బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానానికి సంబంధించి ఎయిర్ ఇండియా సంస్థ బీమా కవరేజీని ఇంజిన్ మార్పిడికి ముందే రూ.750 కోట్ల నుంచి రూ.850 కోట్లకు పెంచింది. ఈ ప్రమాదానికి సంబంధించి ప్రభుత్వ రంగ నాన్-లైఫ్ ఇన్సూరెన్స్ దిగ్గజం జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జీఐసీ) మొత్తం క్లెయిమ్‌లు సుమారు 475 మిలియన్ డాలర్లుగా అంచనా వేసింది. భారత కరెన్సీ



ప్రకారం రూ.4,000 కోట్లకుపైమాటే. ఈ మొత్తంలో విమానం నష్టానికి గానూ 125 మిలియన్ డాలర్లు కాగా, ప్రయాణికుల కుటుంబాలకు చెల్లించాల్సిన పరిహారం, థర్డ్ పార్టీ నష్టాలు, ఇతర వ్యక్తులకు జరిగిన నష్టాలు, ట్రావెల్ పాలసీల కింద మరో 350 మిలియన్ డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది.

## ఇరాన్‌లోని 1100 లక్ష్యాలను ధ్వంసం చేశాం..



ఇరాన్ దేశం నుంచి అణు ముప్పును తాము ఒక వ్యూహం ప్రకారం అణచివేస్తున్నామని ఇజ్రాయెల్ సాయుధ దళాలు తెలిపాయి. ఇప్పటికే తమ ఎయిర్‌ఫోర్స్ ఇరాన్‌లోని 1,100 లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రతినిధి, బ్రిగేడియర్ జనరల్ ఎఫీ డెఫ్రిన్ వెల్లడించారు. 'మేం ఒక పద్ధతి ప్రకారం ఇరాన్‌లోని అణుముప్పును నాశనం చేస్తున్నాం. మా దాడులు వారి నష్టాన్ని గణనీయంగా పెంచుతున్నాయి. ఫలితంగా వారి బాలిస్టిక్ క్షిపణులు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు దెబ్బతింటున్నాయి' అని డెఫ్రిన్ పేర్కొన్నారు. దాడులకు సంబంధించిన వీడియోలను కూడా ఇజ్రాయెల్ దళాలు షేర్ చేశాయి. కాగా ఇజ్రాయెల్ వాయుసేనకు చెందిన విమానాలు గత శుక్రవారం నుంచి ఇరాన్‌పై దాడులు చేస్తున్నాయి. పశ్చిమ ఇరాన్, టెహ్రాన్ గగనతలంపై తాము పూర్తిగా పట్టు సాధించినట్లు చెబుతున్నాయి. ఇప్పటివరకు 70 ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ బ్యాటరీలను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ చెబుతోంది. ఇదిలావుంటే ఇజ్రాయెల్‌కు చెందిన ఓ భారీ డ్రోన్‌ను కూల్చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ కూడా ధ్రువీకరించింది. తమ మానవరహిత విమానాన్ని ఇరాన్ ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణిని వాడి ధ్వంసం చేసిందని పేర్కొంది.

# లొంగిపోయే ప్రసక్తే లేదు

## - ఇరాన్ సుప్రీం లీడర్

**ఇంటర్నెట్ డెస్క్:** తమపై దాడి చేసి ఇజ్రాయెల్ భారీ తప్పిదం చేసిందని, అందుకు శిక్ష తప్పదని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ దాడుల వేళ వీడియో సందేశం విడుదల చేసిన ఆయన.. ఇరాన్ లొంగిపోదనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ట్రంప్ హెచ్చరికలను ఉద్దేశిస్తూ.. అటువంటి బెదిరింపులకు భయపడమనే విషయం ఇరాన్ చరిత్ర తెలిసిన వారికి అర్థమవుతుందన్నారు. అంతేకాదు అమెరికా సైన్యం జోక్యం చేసుకుంటే కోలుకోలేని నష్టం ఉంటుందన్న విషయం అమెరికన్లు తెలుసుకోవాలన్నారు.



విస్తృత యుద్ధమే..!

ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న పోరులో అమెరికా జోక్యం చేసుకుంటే అది పశ్చిమాసియాలో విస్తృత యుద్ధానికి దారితీస్తుందని ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి కూడా హెచ్చరించారు. ఘర్షణల నేపథ్యంలో తొలిసారి స్పందించిన ఆయన.. తమపై దాడులకు దీటుగా స్పందిస్తామన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్‌ను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసని.. ఆయన సురక్షితంగా ఉన్నారని చెప్పారు. అయితే, ప్రస్తుతానికి ఆయన్ను చంపాలనుకోవడం లేదన్నారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని, లేదంటే పరిస్థితులు తీవ్రంగా మారుతాయని ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో ఖమేనీ ఈ విధంగా స్పందించారు.

### యూఎస్ సైన్యం జోక్యం చేసుకుంటే కోలుకోలేని నష్టం.. అమెరికాకు ఇరాన్ సుప్రీం లీడర్ వార్నింగ్

ఇజ్రాయెల్-ఇరాన్ ఘర్షణ తీవ్రరూపం దాలుస్తున్న దృష్ట్యా ఇరాన్ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ బేషరతుగా లొంగిపోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించిన విషయం తెలిసిందే. ట్రంప్ వ్యాఖ్యలపై ఖమేనీ తాజాగా స్పందించారు. లొంగిపోయే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అంతేకాదు అమెరికా సైనిక జోక్యం వల్ల కోలుకోలేని నష్టం జరుగుతుందని హెచ్చరించారు. ఈ మేరకు ఖమేనీ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. 'ఇరాన్ దేశ చరిత్ర తెలిసిన తెలివైన వ్యక్తులు ఈ దేశంతో ఎప్పుడూ బెదిరింపు ధోరణితో మాట్లాడరు. ఎందుకంటే ఇరాన్ దేశం ఎన్నటికీ లొంగిపోదు. అమెరికా సైనిక జోక్యం చేసుకుంటే.. నిస్సందేహంగా కోలుకోలేని నష్టం ఉంటుందన్న విషయాన్ని అమెరికన్లు తెలుసుకోవాలి' అని సుప్రీం లీడర్ హెచ్చరించారు.

### ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తెలుసు..

ఇరాన్ సుప్రీం నాయకుడు అయాతొల్లా అలీ ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసునని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం వెల్లడించారు. అయితే ఖమేనీ చావును ప్రస్తుతానికి తాము కోరుకోవడం లేదని ఆయన తెలిపారు. ఇజ్రాయెల్-ఇరాన్ ఘర్షణ తీవ్రరూపం దాలుస్తున్న దృష్ట్యా బేషరతుగా లొంగిపోవాలని సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కేవలం కాల్పుల విరమణను మాత్రమే తాను కోరుకోవడం లేదని, అంతకన్నా మెరుగైన పరిష్కారాన్నే తాను కోరుకుంటున్నానని ట్రంప్ ప్రకటించారు. జీ7 సదస్సును అర్ధాంతరంగా ముగించుకుని సోమవారం రాత్రి కెనడా నుంచి వాషింగ్టన్‌కు తిరిగివస్తూ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

## ఆర్థిక వ్యవస్థకు విఘాతం



**ఢిల్లీ:** నకిలీ కరెన్సీ నోట్ల రాకెట్‌లో అరెస్టైన విదేశీయుడికి సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. అతడు పాల్పడిన చర్యలను ఆర్థిక వ్యవస్థకు విఘాతంగా పేర్కొంది. ఇలాంటి వ్యక్తికి బెయిల్ మంజూరు చేయడం మంచిది కాదని వ్యాఖ్యానించింది. బల్గేరియాకు చెందిన రుస్లన్ పెట్రోవ్ మెతోదివ్ మనదేశంలో నకిలీ కరెన్సీ నోట్లను ముద్రించేవాడు. ఈ రాకెట్ వెలుగులోకి రావడంతో 2023లో ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రూ.8 లక్షల విలువ గల రూ.500 నకిలీ నోట్లు, వాటిని తయారు చేసే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నిందితుడు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయగా.. కోర్టు తిరస్కరించింది. దీంతో రుస్లన్ పెట్రోవ్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. దీనిపై తాజాగా న్యాయస్థానం విచారణ చేపట్టింది.

**కిడ్నాప్ కేసులో ఏడీజీపీ అరెస్టు.. సుప్రీంకోర్టు సీరియస్**

"ఇలాంటి చర్యలు ఆర్థిక వ్యవస్థకు విఘాతం కలిగిస్తాయి అనడంలో అతిశయోక్తి లేదు. రూ.8 లక్షల నకిలీ డబ్బుతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యక్తిపై నేరారోపణలు చాలా బలంగా ఉన్నాయి. నేరం రుజువై దోషిగా తేలితే దీర్ఘకాలిక శిక్ష విధించే అవకాశం ఉంది. ఇలాంటి నేరానికి పాల్పడిన వ్యక్తికి బెయిల్ మంజూరు చేస్తే.. అతడు పరారయ్యే అవకాశం లేకపోలేదు. అతడి అభ్యర్థనను మన్నించడం ఆమోదయోగ్యం కాదు" అని సుప్రీం కోర్టు పేర్కొంది.

## 'ఇకపై హిందీ తప్పనిసరి కాదు'




**ముంబై:** మహారాష్ట్ర పాఠశాలల్లో హిందీని తప్పనిసరి బోధన నుంచి ఉపసంహరించారు. మరాఠీ, ఇంగ్లీష్ తర్వాత మూడవ భాషగా హిందీని పరిగణిస్తూ, ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు హిందీని మూడవ భాషగా తప్పనిసరిగా బోధించడాన్ని రద్దు చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ నూతన నోటిఫికేషన్ జారీ చేసింది. ఒక తరగతిలో 20కి మించిన విద్యార్థులు హిందీకి బదులుగా మరొక భాష నేర్చుకోవాలనుకుంటే, సంబంధిత ఉపాధ్యాయుణ్ణి అందుబాటులో ఉంచనున్నారు. రాష్ట్ర పాఠశాల విద్యా ప్రణాళిక- 2024 ప్రకారం మరాఠీ, ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో ఒకటి నుండి ఐదు తరగతులకు హిందీ ఇకపై మూడవ భాషగా ఉంటుంది. అయితే ఈ విద్యార్థులు హిందీకి బదులుగా ఇతర భారతీయ భాషలలో ఒకదాన్ని మూడవ భాషగా నేర్చుకోవాలనుకుంటే వారికి అందుకు అనుమతి కల్పిస్తారు. మహారాష్ట్ర పాఠశాలల్లో త్రిభాషా సూత్రం అమలు చేస్తున్నారు. అన్ని పాఠశాలల్లోనూ మరాఠీ భాషను తప్పనిసరి చేశారు.

## 11 ఏళ్ల నాటి కేసులో..

## ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు జైలు శిక్ష

**జైపూర్:** సుమారు 11 ఏళ్ల నాటి కేసులో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సహా 9 మంది దోషులకు కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. అయితే వారందరికీ బెయిల్ మంజూరు చేసింది. ఈ తీర్పును హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు నెల గడువు ఇచ్చింది. 2014 ఆగస్టు 13న జైపూర్‌లోని రాజస్థాన్ యూనివర్సిటీ ప్రధాన ద్వారం బయట జేఎల్‌ఎన్ మార్గాన్ని సుమారు 20 నిమిషాలపాటు నిరసనకారులు దిగ్బంధించారు. ఈ నిరసన సందర్భంగా చట్టవిరుద్ధంగా సమావేశమై ప్రజా రహదారిని అడ్డుకున్నందుకు పోలీసులు కేసు నమోదు చేశారు. 2016 ఆగస్ట్ 11న ఛార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. కాగా, ఈ కేసుపై 11 ఏళ్లుగా కోర్టులో విచారణ కొనసాగింది. జైపూర్ జిల్లా కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సహా తొమ్మిది మంది వ్యక్తులను దోషులుగా నిర్ధారించింది. ఒక్కొక్కరికి ఒక సంవత్సరం జైలు శిక్ష విధించింది. వారందరికీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ తీర్పు, శిక్ష నిలిపివేతపై హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు నెల సమయం ఇచ్చింది. మరోవైపు జైలు శిక్ష పడిన 9 మందిలో లద్నున్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ముఖేష్ భాకర్, షాపురాకు కాంగ్రెస్ ఎమ్మెల్యే మనీష్ యాదవ్, జోత్వారా అసెంబ్లీ స్థానానికి చెందిన మాజీ కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ చౌదరి ఉన్నారు. అయితే దోషిగా నిర్ధారించిన ఇద్దరు కాంగ్రెస్ నేతల అసెంబ్లీ సభ్యత్వంపై ఎలాంటి ప్రభావం ఉండదు. ప్రస్తుత చట్టం ప్రకారం జైలు శిక్ష రెండేళ్లకు మించితేనే ఎంపీ, ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దవుతుంది.

## నేనేం చేస్తానో ఎవరికీ తెలియదు

ఇరాన్ వ్యవహారంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ఇప్పటికే హద్దులు మీరి ప్రవర్తించిందని, దానిపై స్పందించడంలో చాలా జాప్యం జరిగిందని ఆయన అన్నారు. ఇజ్రాయెల్‌తో ఇరాన్‌కు కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో, ఈ వివాదంలో అమెరికా జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ఇరాన్‌పై లేదా ఆ దేశ అణు కేంద్రాలపై దాడులు చేసే ఆలోచన అమెరికాకు ఉందా అనే విషయాన్ని స్పష్టం చేయడానికి ట్రంప్ నిరాకరించారు. అయితే, టెహ్రాన్ తన పరిమితులను అతిక్రమించిందని, దీనిపై చర్యలు తీసుకోవడం ఇప్పటికే ఆలస్యమైందని ఆయన అభిప్రాయపడ్డారు. వచ్చే వారంలో లేదా అంతకంటే ముందుగానే చాలా కీలకమైన పరిణామాలు చోటుచేసుకోవచ్చని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. "వారం క్రితం ఉన్న పరిస్థితులతో పోలిస్తే ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో నేను జోక్యం చేసుకుంటానో లేదో చెప్పలేను. నేను ఏం చేయబోతున్నానో ఎవరికీ తెలియదు" అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో చర్చలు జరిపేందుకు ఇరాన్ ప్రతిపాదన చేసిందని చెబుతూనే, ఆ చర్చలు ఎప్పుడు, ఏ విధంగా జరుగుతాయనే వివరాలను వెల్లడించలేదు. ప్రస్తుతం టెహ్రాన్ తనను తాను రక్షించుకోలేని స్థితిలో ఉందని, ఆ దేశం వద్ద సరైన గగనతల రక్షణ వ్యవస్థలు కూడా లేవని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ అగ్రనాయకత్వం గురించి అడిగిన ప్రశ్నకు, 'గుడ్‌లక్' అంటూ ట్రంప్ బదులిచ్చారు. టెహ్రాన్ విషయంలో తన యంత్రాంగానికి ఓపిక నశించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకోవడంపై స్థానికంగా వ్యక్తమవుతున్న ఆందోళనల గురించి మాట్లాడుతూ, సుదీర్ఘకాలం యుద్ధం చేయాలనే కోరిక తమకు లేదని అన్నారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదన్నదే తన ప్రధాన ఉద్దేశమని ఆయన పునరుద్ఘాటించారు. మరోవైపు, ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని ఉద్దేశించి అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసని, ఆయన సురక్షితంగానే ఉన్నారని ట్రంప్ అన్నారు. అయితే, ప్రస్తుతానికి ఆయన్ను అంతమొందించాలనే ఆలోచన లేదని, ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని, లేకపోతే పరిస్థితులు మరింత తీవ్రంగా మారతాయని హెచ్చరించారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై సుప్రీం లీడర్ ఖమేనీ తీవ్రంగా ప్రతిస్పందించారు. లొంగిపోయే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

# హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లల్లో వేగం పెంచండి

-మొదటిపేజీ తరువాయి

ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్టు సీఎంకు అధికారులు తెలిపారు. బాపట్ల -3, గుంటూరు2, పలనాడు -1, ప్రకాశం - 1 కొనుగోలు కేంద్రాలు ద్వారా పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని.. వీటి ద్వారా రేపటి నుంచే కొనుగోళ్లు ముమ్మరం చేస్తామని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. కొనుగోళ్ల కేంద్రాల వివరాలను, సంబంధిత సమాచారాన్ని ప్రతీ పొగాకు రైతుకు అందివ్వాలని సీఎం ఆదేశించారు.

**ఎగుమతులు పెంచేందుకు అత్యుత్తమ గ్రేడింగ్ విధానాలు అమలు చేయండి**

పామ్ ఆయిల్ పై సుంకం తగ్గింపు, మ్యాంగో పల్ప్ పై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించే అంశంపై ఇప్పటికే కేంద్రంతో మాట్లాడానని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దీనిపై అధికారులు సంబంధిత కేంద్ర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మామిడి పంటకు సంబంధించి పంట ప్రణాళికపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సీఎం అధికారులకు సూచించారు. పండించిన పంటకు సరైన ధర దక్కాలంటే.. ఆ పంటకు మార్కెట్టులో ఎలాంటి డిమాండ్ ఉందనే సమాచారం రైతులకు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మామిడికి ఒక్కో కిలోకు రూ.4 చొప్పున అదనంగా మద్ధతు ధర ఇస్తున్నామని.. ప్రాసెసింగ్ యూనిట్లు రూ.8కి తగ్గకుండా



కొనుగోలు చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. రైతులకు నష్టం రాకుండా ప్రభుత్వం ఆదుకుంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మరోవైపు ఈ ఏడాదిలో కోకో 12 వేల మెట్రిక్ టన్నుల మేర ఉత్పత్తి వచ్చిందని అధికారులు సీఎంకు వివరించారు. ఇప్పటికే 10 వేల మెట్రిక్ టన్నుల మేర విక్రయం కూడా జరిగినట్టు తెలిపారు. ప్రతీ రోజూ 80 నుంచి 100 మెట్రిక్ టన్నుల మేర కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. జూలై మొదటి వారానికి మిగిలిన ఉత్పత్తిని కూడా కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా పండ్లకు సంబంధించిన ప్రాసెసింగ్ యూనిట్లను మరిన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అంతర్జాతీయ మార్కెట్ కు అవసరమైనట్టుగా ఎగుమతులు పెంచేందుకు అత్యుత్తమ గ్రేడింగ్ విధానాలను అమలు చేయాల్సిందిగా సీఎం సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్నారు.

# 'ఏపీలో అభివృద్ధి, సంక్షేమం ఏదీ లేదు

-మొదటిపేజీ తరువాయి

ఆవిష్కరించి.. ఆ కుటుంబాన్ని పరామర్శించి.. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

'ఏపీలో అభివృద్ధి, సంక్షేమం ఏదీ లేదు. కేవలం రెడ్‌బుక్ రాజ్యాంగం? మాత్రమే నడుస్తోంది. దారుణమైన పరిస్థితులు ఉన్నాయి అనడానికి ఆంక్షలే నిదర్శనం. తమకు అనుకూలమైన పోలీసులను ఎన్నికల ఫలితాల వేళ నియమించుకున్నారు. కూటమిని గెలిపించుకునేందుకు అన్యాయాలు చేశారు. ఈ విషయం ఈ ప్రాంతం వారందరికీ తెలుసు. నాగమల్లేశ్వరరావు రెంటపాళ్ల ఉపసర్పంచ్. అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ రోజున టీడీపీ, జనసేన నేతల తప్పుడు ఆరోపణలతో నాగమల్లేశ్వరరావును పీఎస్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఘోరంగా అవమానించారు. టీడీపీకి అనుకూల ఫలితలు రావడంతో నాగమల్లేశ్వరరావు ఇంటిపై దాడి చేశారు. ఊరు విడిచిపోవాలని ఆయన్ని వేధించారు. లేకుంటే రౌడీ షీట్ తెరుస్తామని సీఐ ఏకంగా బెదిరించారు.

జూన్ ఐదో తేదీ రాత్రి పోలీసులు నాగమల్లేశ్వరరావును విడిచిపెట్టారు. ఆయన సరాసరి గుంటూరులోని తన సోదరుడి ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి తన తండ్రికి ఫోన్ చేసి పోలీసులు బెదిరించిన తీరును నాగమల్లేశ్వరరావు వివరించారు. పోలీసుల తీరుతోనే నాగమల్లేశ్వరావు ఆత్మహత్యయత్నం చేశారు. తనకొడుకును కాపాడుకునేందుకు వెంకటేశ్వర్లు తీవ్రంగా యత్నించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. నాగమల్లేశ్వరరావు ఇంటిపై దాడి చేసిన వాళ్లపై చర్యలు తీసుకోలేదు. వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. నాగమల్లేశ్వరరావును బెదిరించిన ఆ సీఐపై చంద్రబాబు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?. నాగమల్లేశ్వరరావుకు భార్యా, కూతురు ఉన్నారు. చంద్రబాబు ఏం సమాధానం చెబుతారు?. ఏడాది గడిచినా ఆ కుటుంబం ఇంకా శోకంలోనే ఉంది అని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే నియోజక వర్గంలో లక్ష్మీనారాయణ అనే పార్టీ కార్యకర్తపైనా పోలీసులు వేధింపులకు పాల్పడ్డారని, అది భరించలేక ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని జగన్ ప్రస్తావించారు.

**కమ్మవాళ్లు మా పార్టీలో ఉంటే నీకేంటి?**

పల్నాడు: ఏపీలో కొందరు పోలీసులు కుల ఉన్మాదంతో పనిచేస్తున్నారని.. కమ్మవాళ్లు కేవలం చంద్రబాబుకి ఊడిగం చేయడానికే పుట్టారా? అని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇక్కడి డీఎస్పీ హనుమంతరావు కుల ఉన్మాది. కమ్మ పుట్టుక ఎందుకు పుట్టావంటూ లక్ష్మీనారాయణ అనే కార్యకర్తను ఆయన అవమానించారు. అది భరించలేక సెల్ఫీ వీడియో తీసి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం



చేశాడు. సీఎం, ఆయన కుమారుడు ఎలాంటి రాజకీయాలు చేస్తున్నారో ఆ వీడియోలో చెప్పాడు. లక్ష్మీనారాయణ ప్రస్తుతం చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. చంద్రబాబూ.. మీకు ఊడిగం చేయడానికే కమ్మవారు పుట్టారా?. వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు నాగమల్లేశ్వరరావు, గుత్తా లక్ష్మీనారాయణ.. ఈ ముగ్గురి విషయంలో.. నేను చంద్రబాబును ఒకటే అడుగుతున్నాను. మా పార్టీలో కమ్మ వాళ్లు ఉండొద్దా? మీ పార్టీ కేవలం వారికేనా? అని వైఎస్ జగన్ నిలదీశారు.

**ఏం పాపం చేశారని..**

వైఎస్సార్‌సీపీలోని కమ్మ సామాజిక వర్గ నేతలను చంద్రబాబు టార్గెట్ చేసి వేధిస్తున్నారు. చంద్రబాబును ఎవరైనా ప్రశ్నిస్తే, వెంటాడి వెంటాడి వేధిస్తున్నారు. తప్పుడు కేసులు పెడుతున్నారు. జైలుకు పంపిస్తున్నారు. ఏం పాపం చేశాడని నాగమల్లేశ్వరరావును పొట్టన పెట్టుకున్నాడు. ఏం పాపం చేశాడని లక్ష్మీనారాయణ ఆత్మహత్య ప్రయత్నం చేసుకునేలా చేశారు. చంద్రబాబుకి ఊడిగం చేయడానికి సిద్ధంగా లేడనే దేవినేని అవినాష్‌ను వేధిస్తున్నారు. ఏం పాపం చేశాడని వల్లభనేని వంశీని జైల్లో పెట్టి వేధిస్తున్నారు. చంద్రబాబు శాడిజానికి వల్లభనేని వంశీ బాధపడుతున్నాడు.

కొడాలి నాని ఏం పాపం చేశాడని కేసు పెట్టారు. ఏంపాపం చేశాడని.. మా పార్టీ నేత తలశిల రఘురాంపై 3 కేసులు పెట్టి వేధిస్తున్నారు. ఏం పాపం చేశాడని అబ్బయ్య చౌదరిని వేధిస్తున్నారు. ఏం పాపం చేశాడని దగ్గుబాటి సురేష్ వైజాగ్ ల్యాండ్ క్యాన్సిల్ చేశారు. ఏం పాపం చేశాడని నంబూరు శంక్రరావును వేధిస్తున్నారు. నా పక్కనే అన్నాబత్తుని శివకుమార్. తెనాలి మాజీ ఎమ్మెల్యే ఉన్నాడు. ఆయననూ వేధిస్తున్నారు. ఏం పాపం చేసిందని.. మంగళగిరికి చెందిన రాజ్‌కుమార్-కృష్ణవేణిలను వేధించారు. రాజ్‌కుమార్‌ను మోకాళ్ల మీద రోడ్డు మీద కూర్చోబెట్టారు. మహిళ అని చూడకుండా కృష్ణవేణిని వేధించారు. ఏం పాపం చేశాడని.. ఇంటూరి రవిపై 19 కేసులు పెట్టి వేధించారు. ఏం పాపం చేశాడని.. ఏం పాపం చేశాడని.. బ్రహ్మానాయుడిని వేధిస్తున్నారు. ఏం పాపం చేశాడని.. పోసానిపై 9 కేసులు పెట్టి వేధించారు. చంద్రబాబును ఎవరైనా కమ్మ వారు వ్యతిరేకిస్తే, వీరు ప్రవర్తిస్తున్న తీరు రాక్షసులకన్నా దారుణం.

**సినిమా చూపిస్తాం**

వైఎస్సార్‌సీపీ కమ్మ నేతలను వేధించే కుట్రలో ఎల్లో మీడియా మీడియా భాగమైంది. చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 ఒక ముఠా. రాష్ట్రాన్ని దోచుకోవడం. అదే మీ పని. గజదొంగలుగా దోచుకుంటున్నారు. అందుకే మిమ్మల్ని వ్యతిరేకిస్తున్న వారిని అణిచి వేస్తున్నారు. పోలీసులూ.. చంద్రబాబు పాపంలో భాగం కావొద్దు.ఒక విషయం గుర్తుంచుకొండి. కొందరు పోలీసు అధికారులకు చెబుతున్నాను. చంద్రబాబు ఎల్లకాలం ఉండడు. ఇప్పటికే ఏడాది గడిచింది. నాలుగేళ్ల తర్వాత మా ప్రభుత్వం వస్తుంది. అప్పుడు మీకు సినిమా చూపిస్తాం. ఇప్పుడు తప్పు చేస్తున్న వారందరినీ బోను ఎక్కిస్తాం. చంద్రబాబు పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు. అందరూ మోసపోయారు. వెన్నుపోటుకు గురయ్యారు. ప్రతి ఒక్కరూ బాధ పడుతున్నారు. ఇది ఎల్లకాలం సాగదు. ప్రజలు, దేవుడు తప్పకుండా మొట్టికాయలు వేస్తారు" అని వైఎస్ జగన్ రెంటపాళ్ల వేదికగా వ్యాఖ్యలు చేశారు.

# ఏలూరు జిల్లాలో ఆయిల్ ఫామ్‌కు ప్రోత్సాహం

-మొదటిపేజీ తరువాయి

కార్యకలాపాలపై ప్రధానంగా చర్చించారు. అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాలు, కోకో వంటి అంతర పంటల సాగుపై అవగాహన, డెల్టా భూముల్లో ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించడం, వరి, పొగాకు వంటి సంప్రదాయ పంటల నుంచి ఆయిల్ ఫామ్ వైపు పంటల వైవిధ్యీకరణ, ఆయిల్ ఫామ్ సాగులో యాంత్రీకరణను ప్రోత్సహించడం వంటి కీలక అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పెదవేగిలోని ఆయిల్ పామ్ పరిశోధన కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నతమైన స్థానంలో ఉందని ప్రశంసించారు. ఈ కేంద్రం ద్వారా అనేక మంది రైతులకు, ఆయిల్ ఫామ్ ప్రాసెసర్లకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందన్నారు. సుమారు 29 మంది శాస్త్రవేత్తలు ఇక్కడ పనిచేస్తున్నారని, 250 ఎకరాల విస్తీర్ణంలో చక్కటి మౌలిక సదుపాయాలతో ఆయిల్ ఫామ్ పంట పరిశోధన, టిష్యూకల్చర్ వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. రైతులకు అధిక దిగుబడులు అందించే ప్రక్రియలను, వివిధ పరిశోధనల గురించి సంస్థ డైరెక్టర్ డాక్టర్ కంచర్ల సురేష్ లోతుగా వివరించారని మంత్రి తెలిపారు. ప్రధానంగా ఐదు కంపెనీల ప్రతినిధులు, శాస్త్రవేత్తలతో ఆయిల్ ఫామ్ పంట సాగుపై సుదీర్ఘంగా చర్చించామని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా దృష్టి సారించామని అన్నారు. అభివృద్ధిలో జిల్లాను ప్రస్తుతమున్న 5వ స్థానం నుంచి 3వ స్థానానికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. జీడీపీ వృద్ధికి ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంటను మరింత విస్తరించాలని, రైతులను ప్రోత్సహించే విషయంపై ముఖ్యమంత్రి సమక్షంలో పలుమార్లు చర్చించినట్లు వెల్లడించారు. ఈ ఏడాది ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యాన్ని 5 వేల హెక్టార్ల నుంచి 15 వేల హెక్టార్లకు పెంచినట్లు ప్రకటించారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ ఆయిల్ ఫామ్ పంట సాగులో ఉన్న సమస్యలను వివరించారని, డెల్టా ప్రాంతంలో కూడా ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు మంత్రి తెలిపారు. పంటసాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో, క్షేత్రస్థాయిలో వాస్తవ సమాచారం పంచుకోవడంలో కొంత జాప్యం జరుగుతోందని గుర్తించామన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయిలో ఒక పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రైతు సహాయ కేంద్రాల సిబ్బంది, హార్టికల్చర్ ఫీల్డ్ విస్తరణాధికారులు, ఐదు ప్రధాన కంపెనీల ప్రతినిధులకు పెదవేగి ఆయిల్ ఫామ్ పరిశోధన కేంద్రం సహకారంతో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ప్రతినెలా సమావేశమై సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పురుగుల నివారణకు వాడాల్సిన ఎరువులు, డ్రిప్ ఇరిగేషన్ వంటి అంశాలపై కూడా అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఆయిల్ ఫామ్ రైతులకు ఒక్క రూపాయి కూడా సబ్సిడీ ఇవ్వకుండా మోసం చేసిందని, అలాగే ఆయిల్ ప్రొడ్యూసర్లను కూడా మోసం చేసి సుమారు రూ. 54 కోట్లు బకాయిలు పెట్టిందని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి, ప్రభుత్వం తరఫున ఎంతవరకు ఆదుకోగలమో పరిశీలిస్తామన్నారు. భవిష్యత్తులో ఇటువంటి పొరపాట్లు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఫాస్టాగ్ వార్షిక పాస్.. ఇదో గేమ్ ఛేంజర్

**అమరావతి:** జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ఉపశమనం కలిగించేలా ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ల వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. భారత రహదారి మౌలిక సదుపాయాల ప్రస్థానంలో దీన్నో గేమ్ ఛేంజర్‌గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ నిర్ణయంతో ఫాస్టాగ్ వార్షిక పాస్ తీసుకురావాలన్న ప్రయాణికుల దీర్ఘకాలిక డిమాండ్‌కు పరిష్కారం లభించినట్లవుతుందని పేర్కొన్నారు. టోల్ చెల్లింపులను సరళీకృతం చేస్తూ.. ప్రయాణ ఖర్చులను గణనీయంగా తగ్గించడం ద్వారా ప్రైవేటు వాహన యజమానులకు ఉపశమనం కలిగించేలా ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌లను అమలులోకి తీసుకొస్తున్నందుకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రూ.3వేల వార్షిక పాస్‌తో వాహనదారులకు ఆర్థిక ఉపశమనం కలగడం మాత్రమే కాదు.. దేశ వ్యాప్తంగా సున్నితమైన, వేగవంతమైన, వివాద రహిత హైవే ప్రయాణం సాకారమవుతుందన్నారు. దీని ద్వారా టోల్ ప్లాజాల సమీపంలో నివసిస్తూ రెగ్యులర్‌గా ప్రయాణించే వారికి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. వారికి సమయంతో పాటు భారం కూడా తగ్గుతుందన్నారు.

**వాహనదారులకు గుడ్‌న్యూస్.. ఫాస్టాగ్ వార్షిక పాస్‌లు తేనున్న కేంద్రం**

ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌లను ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించిన విషయం తెలిసిందే. రూ.3 వేలు చెల్లించి ఈ పాస్ తీసుకోవాల్సి ఉంటుందని ఆయన 'ఎక్స్'లో చేసిన పోస్టును డిప్యూటీ సీఎం కార్యాలయం రీట్వీట్ చేస్తూ పైవిధంగా స్పందించింది. (అయితే కార్లు, జీపులు, వ్యాన్లు వంటి నాన్- కమర్షియల్ వాహనాలకు వర్తించేలా కేంద్రం ప్రకటించిన ఈ పాస్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. పలు నిబంధనలు ఉండే అవకాశముంది.)

## కర్నూలులో హైకోర్టు బెంచ్‌కు సహకరించండి



**ఢిల్లీ:** ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌తో ఏపీ మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అక్కడి ప్రజల చిరకాల కోరిక. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకరించండి. న్యాయపరమైన అవసరాల కోసం రాయలసీమ ప్రజలు ఏపీ రాజధానికి రావడానికి 500 కి.మీ పైగా ప్రయాణించాల్సి ఉంటుంది. యువగళం పాదయాత్ర సందర్భంగా సీమ ప్రజలు, న్యాయవాదులు హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా త్వరితగతిన బెంచ్ ఏర్పాటుకు సహకరించాలి. రాష్ట్రంలోని కోర్టుల్లో జ్యుడిషియరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి సహకారం అందించండి" అని కేంద్రమంత్రిని కోరారు. యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని లోకేశ్ కేంద్రమంత్రికి అందజేశారు.

## ఫోన్ ట్యాపింగ్..
## ఆంధ్రా నేతలను వదల్లేదు

-మొదటిపేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి విచారణకు ఆదేశించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ను ఏర్పాటు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఓఎస్డి ప్రభాకర్ రావును అదుపులోకి తీసుకున్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరపగా ఏపీలో టిడిపి నేతల ఫోన్లను సైతం ట్యాపింగ్ చేసినట్లు ప్రభాకర్ రావు ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. విదేశాల నుంచి కొనుగోలు చేసిన ప్రత్యేక పరికరం ద్వారా వారి ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు సమాచారం.అప్పట్లో ఏపీలో జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉండేవారు. తెలంగాణలో కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉండేవారు. వారిద్దరి ఉమ్మడి శత్రువు చంద్రబాబు. 2018లో తెలంగాణలో ఓడించేందుకు చంద్రబాబు ప్రయత్నించారని.. అందుకు రిటర్న్ గిఫ్ట్ తప్ప దని హెచ్చరించారు కేసీఆర్. 2019 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి పరోక్ష సహకారం అందించి మరింత దగ్గరయ్యారు. అప్పటినుంచి చంద్రబాబును రాజకీయంగా దెబ్బ కొట్టాలని భావించారు ఇద్దరు నేతలు. ఈ క్రమంలో తెలంగాణ సర్కార్ ఫోన్ ట్యాపింగ్ కి పాల్పడిందని.. చంద్రబాబుతో పాటు లోకేష్ ఫోన్లు సైతం ట్యాప్ చేసినట్లు తాజాగా విచారణలో మాజీ ఓఎస్డి వెల్లడించినట్లు తెలుస్తోంది. కేవలం జగన్మోహన్ రెడ్డికి రాజకీయ ప్రయోజనం చేకూర్చాలన్న ఉద్దేశంతో అప్పట్లో ఆ పనికి పాల్పడినట్లు విచారణలో ఒప్పుకున్నట్లు సమాచారంఅయితే ఒక్క టీడీపీ నాయకులే కాదు. కెసిఆర్ కు వ్యతిరేకంగా ఉన్న అన్ని రాజకీయ పార్టీల నేతల ఫోన్లు ట్యాప్ చేసినట్లు ప్రచారంలో ఉంది. విచారణలో కూడా ఇదే అంశాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మాజీ ఓఎస్డి వాంగ్మూలంతో మాజీ సీఎం కేసీఆర్ చుట్టూ వుచ్చు బిగుస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికైతే తెలంగాణలో ఫోన్ ట్యాపింగు ప్రకంపనలు ఏపీకి కూడా తాకాయి. మరి ఎటువైపునకు దారితీస్తాయో చూడాలి.

**నా ఫోన్ ట్యాప్ చేశారు**

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు ఓ సంచలనం. గత సీఎం కేసీఆర్ ప్రతిపక్ష నేతలు, సినీ నటులుతోపాటు.. తనకు గిట్టని జడ్జీల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేయించారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై విచారణ జరుగుతోంది. ఈ కేసులో ఏ1 గా ఉన్న ప్రభాకర్‌రావు ఇటీవలే హైదరాబాద్‌కు వచ్చారు. ఏసీబీ విచారణ చేస్తోంది. ఈ క్రమంలో ఏపీ పీసీసీ చీఫ్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ తనయ వైఎస్.షర్మిల బాంబు పేల్చారు.తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు కొత్త మలుపు తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన ఫోన్లు కూడా ట్యాప్ చేయబడినట్లు సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ ఫోన్ ట్యాపింగ్ కార్యకలాపాల వెనుక ఎస్ఐబీ మాజీ చీఫ్ టి. ప్రభాకర్ రావు బృందం ఉందని, ఈ విషయంలో గోప్యత కోసం కోడ్ భాషను ఉపయోగించినట్లు షర్మిల ఆరోపించారు. తాను ఎవరితో మాట్లాడుతున్నారన్న సమాచారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికప్పుడు చేరవేయబడినట్లు ఆమె అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయిఫోన్ ట్యాపింగ్ కార్యకలాపాలను గుర్తించిన వైఎస్ షర్మిల, తన గోప్యతను కాపాడుకోవడానికి వ్యక్తిగత ఫోన్లను మార్చినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు బృందం, షర్మిల ఫోన్ సంభాషణలను అత్యంత గోప్యంగా ట్యాప్ చేసినట్లు సమాచారం. ఈ కార్యకలాపాలను కనుగొన్న షర్మిల, తన సంభాషణలు రహస్యంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ విషయం ఆమె అనుచరుల ద్వారా ఒక పోలీసు అధికారి ద్వారా హెచ్చరికగా తెలిసినట్లు కూడా ఆమె పేర్కొన్నారు.ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2023 మధ్య జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కాలంలో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, సినీ ప్రముఖులు, జర్నలిస్టులు, హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు సమాచారం. ప్రభాకర్ రావు నేతృత్వంలోని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) ఈ కార్యకలాపాలకు కేంద్రంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొనబడిన ప్రభాకర్ రావు, గతంలో అమెరికాకు వెళ్లిపోయి, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2025 జూన్ 9న హైదరాబాద్‌కు తిరిగి వచ్చి సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) విచారణకు హాజరయ్యారు.సిట్ విచారణలో ప్రభాకర్ రావు రాజకీయ నిఘా కోసం ప్రత్యేకంగా ఎస్వోటీ (స్పెషల్ ఆపరేషన్ టార్గెట్స్) విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు అంగీకరించినట్లు సమాచారం.

# ఏఐటియుసి ఆధ్వర్యంలో వెల్దుర్తి ఎమ్మార్వో వినతి పత్రం







**(ప్రజా జ్యోతి రిపోర్టర్) 18-06-2025.** ఈరోజు వెల్దుర్తి ప్రాజెక్టు నందు అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ గారి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు చాందిని మరియు నియోజకవర్గ అధ్యక్షులు సుజాత సంధ్య ఎమ్మార్వో ఆఫీస్ నందు సీనియర్ అసిస్టెంట్ అస్లాం గారికి అంగన్వాడి సమస్యల మీద వినతి పత్రం ఇవ్వడం అయినది.... ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ గారు మాట్లాడుతూ గత 50 సంవత్సరముల నుండి శాఖ ప్రారంభమైనది... 40 సంవత్సరాల నుండి అతి తక్కువ గౌరవ వేతనంతో గ్రామీణ పట్టణ పేద నిరుపేద కుటుంబాలలోని గర్భవతులు బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు నిత్యం సేవలు అందిస్తూ పనిచేస్తున్నాము.. కూటమి గవర్నమెంట్ ఎలక్షన్ కంటే ముందు అంగన్వాడి వర్కర్లు మినీ వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని మేము చేసిన 42 రోజుల సమ్మె సందర్భంగా హామీ ఇవ్వడం జరిగింది ప్రభుత్వము వచ్చి సంవత్సరం అయినప్పటికీ ఎలాంటి సమస్యలు పరిష్కరించకపోగా తల్లికి వందనం పథకం టీచర్స్ హెల్పర్స్ మినీ వర్కర్లకు వేయలేదు...అలాగే ప్రజా సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగి అను నమోదును చేశారు.. వర్కర్ కి 11,500 హెల్పర్ కి 7000 రూపాయలు మినీ వర్కర్ కి 7000 రూపాయలు ఇస్తున్న ప్రభుత్వం అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగి అని నమోదు చేయించడం ఎంత మాత్రం సమంజసం అని కూటమి ప్రభుత్వం ఒకసారి పునరాలోచించాలని తక్షణమే అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగి అను నమోదును తొలగించాలని తల్లికి వందనం వెంటనే అమలు చేయాలని తెలియజేసారు...అలాగే ఈ మధ్యకాలం లో పోషన్ ట్రాకర్ ఆప్ లో ఈ కేవైసీ ఎఫ్ ఆర్ ఎస్ ద్వారా హక్కుదారులకు స్టాక్ ఇవ్వాలని జత చేయడం జరిగింది.. ఈ యాప్ లో ఈ కేవైసీ ద్వారా చేయడం అంగన్వాడీలకు చాలా కష్టంతో కూడిన పని ఇప్పటికే గ్రామాల్లో అంగన్వాడీలు ఈ సమస్యని చాలా సందర్భాల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు దయచేసి పో షణ్ ట్రాక్టర్ యాప్ లో ఈ కేవైసీ మరియు ఎఫ్ ఆర్ ఎస్ ను వెంటనే తొలగించాలని తెలియజేయడం జరిగింది తక్షణమే ఆప్స్ అన్నింటిని సవరించి ఒకే ఆప్ గా చేయాలని తెలియజేయడం జరిగింది ప్రభుత్వం నుండి అమలవుతున్న సంక్షేమ పథకాలు అన్ని అంగన్వాడీ వర్కర్స్ కు వర్తింపచేయాలని లేనిపక్షంలో తీవ్రతరమైన ఉద్యమం చేయాల్సి వస్తుంది అని ఆవేదన వ్యక్తం చేశారు ప్రతినెల రెండవ తేదీ వేతనాలు మరియు బిల్స్ వెంటనే అమలు చేయాలని తెలియజేయడం జరిగింది ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాధవ స్వామి మరియు అంగన్వాడీ టీచర్లు వెల్దుర్తి మండలం క్రిష్ణగిరి మండలం టీచర్స్ విజయలక్ష్మి రేణుక ఈ దమ్మా వరలక్ష్మి లక్ష్మి కిషోర్ షాహిదా రజని గంగ సుమలత సెమీనా శిరీష తదితరులు అంగన్వాడి సిబ్బంది పాల్గొనడం అయినది...

# ఎస్సీ కాలనీ విద్యార్థులు ఎంపీపీ స్కూలో యధాతధగా కొనసాగాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్









ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్ మా డిమాండ్

**( ప్రజా జ్యోతి రిపోర్టర్ ) 18-06-2025.** కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి గ్రామం ఎస్సీ కాలనీలో ఉన్న ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్లో ఉన్న మూడు,నాలుగు,ఐదు తరగతి విద్యార్థులను వేరే పాఠశాలకు పంపడాన్ని, వ్యతిరేకిస్తున్నామని ఏపీ ఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్ మాదిగ అన్నారు, వెల్దుర్తి ఎంఈఓ ఆఫీస్ ముందర గోవర్ధనగిరి గ్రామ దళిత కుటుంబాలతో పాటు, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ఎస్సీ కాలనీలో ఉన్న ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులను వేరే స్కూలుకు బదిలీ చేయడాన్ని,నిరసిస్తూ ఆందోళన చేసిన అనంతరం ఎంఈఓ 2, రమేష్ గారికి వినతి పత్రం అందజేసిన ,అనంతరం ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు దాదిపోగు నవీన్ మాదిగ మాట్లాడుతూ గోవర్ధనగిరి గ్రామం ఎస్సీ కాలనీలో ఉన్న ఎలిమెంటరీ స్కూల్ మూడు నాలుగు ఐదు తరగతులకు చెందిన విద్యార్థులు ఇక్కడ పాఠశాల నుండి వేరే పాఠశాలకు బదిలీ చేస్తే ప్రస్తుతం ఎస్సీ కాలనీలో ఉన్న పాఠశాలలో ఒకటి రెండు తరగతుల విద్యార్థులు మాత్రమే ఉంటారని,వీరి సంఖ్య సుమారు 20 మందికి పైగా ఉన్నారని భవిష్యత్తులో విద్యార్థుల సంఖ్య స్కూల్లో తగ్గితే ఎస్సీ కాలనీలో ఉన్న స్కూలు తీసివేస్తారేమో అన్న ,భయం గ్రామానికి చెందిన ఎస్సీలలో ఉందని,ప్రస్తుతం స్కూల్లో ఉన్న విద్యార్థులను బదిలీ చేయడం విషయమై స్కూల్ కమిటీకి గాని,గ్రామానికి చెందిన దళిత కుటుంబాలకు కానీ, కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియదని,ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి భవిష్యత్తులో స్కూలులో ఉన్న అన్ని తరగతులు అలాగే ఉండాలంటే ,ఒకటి నుంచి ఐదు తరగతులకు చెందిన విద్యార్థులను గతంలో ఉన్న మాదిరిగానే యధాతథంగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు, పైగా ఎస్సీ కాలనీ విద్యార్థులు ప్రస్తుతం బదిలీ చేసిన స్కూల్ కి వెళ్లాలంటే కొన్ని సామాజిక సమస్యలతో పాటు కొన్ని ఇబ్బందులు ఉన్నాయని వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, అలా కాకుండా అధికారులు ఏకపక్షంగా వ్యవహరించి ఇలాగే కొనసాగిస్తే భవిష్యత్తులో స్కూలు లో ఒకటి నుండి ఐదు తరగతుల వరకు నిలబెట్టుకోవడానికి , గ్రామానికి చెందిన ఎస్సీలతో కలిసి,ఏపీ ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏపీ ఎంఆర్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు టైలర్ రాముడు, మరియు గోవర్ధనగిరి గ్రామ నాయకులు మద్దిలేటి,చిన్న కిష్టన్న,అయ్యన్న,రంగస్వామి, చిన్న మద్దిలేటి, నాయకులు ఎల్లకృష్ణ, టైలర్ కృష్ణ, పుల్లయ్య, మధు, పెద్ద హనుమంతు, తిరుపాలు, ఎర్రన్న, అయ్యన్న తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు, దళిత, గిరిజనులకు న్యాయం జరిగేంత వరకు ఉద్యమిస్తూనే ఉంటాం

విద్యార్థి - ప్రజా సంఘాల ఐక్యవేదిక



**అనంతపురం జూన్ 18 (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలో మైనర్,బాలికపై,దళిత, మహిళలపై,అత్యాచారాలు, హత్యలను ఖండిస్తూ విద్యార్థి-ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం అనంతపురం పట్టణంలోని సంగమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి,కలెక్టరేట్ దగ్గర మహాధర్నాను నిర్వహించారు. ఈ ర్యాలి, మహా ధర్నాకు ప్రజా సంఘాల నాయకుల తోపాటు, విద్యార్థి,యువజన,మహిళా నాయకులు,వివిధ పార్టీల నాయకులు పాల్గొని రాష్ట్రంలో దళిత, మైనర్ బాలికల మీద జరిగిన అత్యాచార, హత్య ఘటనలో, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో మహిళలు, దళిత, గిరిజనుల మీద జరుగుతున్న దాడులను హత్యలను ఖండిస్తూ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మకి, అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారా యణ కి వినతి పత్రం ఇస్తూ సమస్య తీవ్రతను వివరించ డం జరిగింది. ఈ సందర్భంగా ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ మాట్లాడుతూ ఇటీవల మన రాష్ట్రంలో మహిళల మీద దాడులు ఎక్కువ అయ్యాయ ని,మరియు దళిత మైనర్ బాలికల మీద దాడులు,అత్యా చారాలు,హత్యలకు కారుకులై న నిందితులను కఠినంగా శిక్షించాలని ,అత్యాచారాలకు కారణమవుతున్న అశ్లీల చిత్రాలు ,నెట్ కంటెంట్లను, పాశ్చాత్య విష సంస్కృతిని వెంటనే నిషేధించాలని, ప్రభుత్వం వెంటనే మద్యం నిషేధాన్ని ప్రకటించి అమలు చేయాలి,బాధిత కుటుంబా లకు తక్షణ సహాయ అర్థం ప్రభుత్వం వెంటనే కోటి రూపాయల నష్టపరిహారం అందించాలి,బాధ్యత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి, ప్రభుత్వం వెంటనే వారికి పది ఎకరాల వ్యవసాయ సాగు భూమిని కేటాయించాలి.ఇంటి స్థలం పక్కా గృహం మంజూరు చేయాలని పై డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలుచేసి మహిళలకు రక్షణ కల్పించా లని విద్యార్థి - ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి సాకే హరి,రాయల సీమ విద్యావంతుల వేదిక నాయకులు మొండి వెంకటేష్, సామాజిక న్యాయ వేదిక జిల్లా కార్యదర్శి కుల్లాయప్ప,పౌరస హక్కుల సంఘం జిల్లా కార్యద ర్శి ఆదినారాయణ,ప్రజా కళామండలి నాయకులు విజయ్, బీసీ యువసేన నాయకులు చంద్రచర్ల హరి, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు నాగరాజు,సహాయ కార్యదర్శి పీ.కిష్ట,పట్టణ పేదల సంఘం నగర అధ్యక్షుడు వీరనారప్ప, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వ్యవస్థాపక అధ్యక్షులు కొడవండ్ల నరేష్,ఎమ్మార్పీఎస్ నాయకుడు చెన్నకేశవులు,వి ఎన్ ఐ వి రాష్ట్ర అధ్యక్షులు టీ.బి.రామన్న,హరి,పి డి ఎస్ యు జిల్లా కోశాధికారి బండారు శంకర్,ఉదయ్,నాయకులు తేజ,దావీదు,కుమార్,నాగరజు, సాంబ,రఘునాథ్ రెడ్డి, జిలాన్,సత్తార్,ఓబులమ్మ, దాదు బి,నాగరత్నమ్మ వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధికూలీలంతా ఐక్యతతో హక్కుల రక్షణ కై ఉద్యమించాలి.



**పోడూరు, జూన్ 18,ప్రజాజ్యోతి న్యూస్ (రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** ఉపాధికూలీలంతా ఐక్యతతో హక్కుల రక్షణకై ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం పోడూరు మండల కార్యదర్శి మోడీ మోజెష్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం తూర్పుపాలెం ఆనందరావు పేటలో బుధవారం ఉపాధి పనులను అయన పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఉపాధి వేతన బకాయిలు వెంటనే వారి బ్యాంక్ ఖాతా లోకి జామచేయాలన్నారు. 200రోజులు పనికల్పించాలన్నారు. వేతనం రూ. 600 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మేట్ అరిగెల కిషోర్, కర్ని చిన్నారి,ఎన్ సరోజ,పి సరళ ఉపాధికూలీలకు టీ, బిస్కెట్ ప్యాకెట్స్ అందజేశారు.ఈకార్యక్రమంలో కె సంపత్ రావు, ఏ సత్తిరాజు,కె మసేనరావు,సతీష్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీంపోలుగ్రామ క్రీడామైదానంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన అరకు ఇంచార్జ్ సేవేరి దున్నుదొర.



**అనంతగిరి జూన్ 18 ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** విశాఖపట్నంలో ఈనెల 21.వ తేదీన జరుగు యోగా దినోత్సవం పురస్కరించుకొని అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం భీంపోలు పంచాయితీ. భీంపోలు గ్రామ క్రీడా మైదానంలో చిమిడిపల్లి గ్రామ పెద్దలు జన్ని లక్ష్మణ. ముక్కిరాంబాబుపాస్టర్. గరవ కన్నయ్య. జన్ని ఏలియా. మాదల కన్నయ్య తదితరులు సహకారంతో క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్. విజయనగరంజోనల్ ఆర్టీసీ చైర్మన్ సేవేరి దున్న దొర ముఖ్య అతిథిగా హాజరైబుధవారం నాడు క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించి జెండా ఊపగా క్రీడాకారులు ఆటను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతు గిరిజన యువకులను క్రీడల్లో ఉత్తేజపరిచి మునుముందుకు క్రీడా క్రీడాకారులుగా జిల్లా.రాష్ట్రస్థాయిలో రాణించి ఎదగాలనే ఉద్దేశంతో క్రీడలను ప్రోత్సహించి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి భీంపోలుగ్రామపంచాయతీ సర్పంచ్ జన్నిబిమలమ్మ . మాజీ సర్పంచ్ ఈశ్వరరావు. బోర్రాసర్పంచ్ అప్పారావు. మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి భీమరాజు. మండల క్లస్టర్ ఇన్చార్జి పాంగి బాబి. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సుబ్బారావు. సీనియర్ నాయకులు చిట్టిబాబు. శంకర్రావు. అప్పలస్వామి. పాడి నాగేష్. బిడ్డ మహేష్. సోములు పాల్గొన్నారు.

## బీంపోలు గ్రామ సచివాలయానికి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఆగ్రహించిన అరకు ఇంచార్జ్ దోన్ను దొర.




**అనంతగిరి జూన్.18 ప్రజా జ్యోతి న్యూస్ రిపోర్టర్. శంకర్.** మండలంలో బీంపోలు పంచాయితీ కేంద్రంలోగల గ్రామ సచివాలయానికి పూర్తిస్థాయి విద్యుత్ సౌకర్యము లేకపోవడంతో తెలుగుదేశం పార్టీ అరుకు ఇంచార్జ్ ఒకసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పర్యటనలో భాగంగా బుధవారం నాడు బీంపోలు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు సందర్శన సమయంలో విద్యుత్ లేకపోవడం వలన ఏ విధంగా ఉద్యోగులు ప్రజల పనులు చేస్తున్నారని సచివాలయంలో విద్యుత్తు లేకపోతే ప్రజలకు ఏ విధంగా పనులు జరుగుతాయని ఆవేదన చెందారు.విద్యుత్ సమస్యపై సంబంధిత విద్యుత్ శాఖ అధికారికి ఫోన్ చేసి సమాచారం కోరగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. ఆగ్రహం చెందిన ఇన్చార్జి దొర అధికారి పనితీరుపై జిల్లా అధికారులకు తగు చర్యలు కోరుతూ ఫిర్యాదు చేయడం జరుగుతుందని. సచివాలయానికి తక్షణమే విద్యుత్ సరఫరాకు సంబంధిత మండల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో కఠిన చర్యలు ఉంటాయనిఇన్చార్జ్ హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ సరఫరా అందించకుండా. ప్రైవేట్ రెస్టారెంట్లకు. ప్రైవేటు భూముల అభివృద్ధికి తదితర పనికిమాలిన పనులకు లంచాలు తీసుకొని సంబంధిత శాఖ అధికారులు విద్యుత్ సరఫరాచేస్తున్నట్లు.స్థానికుల నుండి ఫిర్యాదులు అందాయని దొర అన్నారు. అధికారులు ఇంకా వైసీపీ పాలనలో ఉన్నారని తీరు మార్చుకోకపోతే ఇంట్లో కూర్చోవాల్సిన పరిస్థితి ఉద్యోగులకు ఏర్పడుతుందని ఆయన గుర్తు చేశారు.

# కన్నుల పండువగా ముగిసిన పైడితలమ్మ పండుగ మహోత్సవం







జనసందోహంతో కిటకిటలాడిన పురవీధులు

వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజలు

అన్ని ఏర్పాట్లు చేసిన వివిధ శాఖల అధికారులు

భారీ పోలీస్ బందోబస్తు

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు

వైభవంగా అమ్మవారి అనుపోత్సవం

**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** ప్రజలను చల్లగా లాలిస్తూ...లోకాలను పాలించే లోకమాతగా ....కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి.... ఉత్తరాంధ్ర ప్రజలకు చల్లని వరం ....ముసిడిక వనంలో సైతం పెద్ద ఎత్తున భక్తులచే దేదివ్యమానంగా జేజేలు అందుకుంటున్న శ్రీ పొందూరు పైడితల్లి అమ్మవారి పండుగ మహోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. పొందూరు తో పాటు జోగన్న పేట ,లక్ష్మీ పేట , ఏరుకుల పేట , ఎరుకుల కాలనీ , అలబోయిన పేట , తాపీ మేస్త్రీ కాలనీ , కృష్ణాపురం ( గారపేట ) గ్రామాల్లో అమ్మవారి పండుగ బుధవారం తో ఘనంగా ముగిసాయి. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో పండుగ కమిటీ సభ్యుల కృషి అమ్మవారి పండుగను దిగ్విజయంగా నిర్వహించారు. 15 ఏళ్ల తర్వాత నిర్వహించిన పండుగ కావడంతో వివిధ ప్రాంతాల నుండి ప్రజలు తండోప తండాలుగా తరలివచ్చారు. బంధు మిత్రులతో ప్రతీ ఇల్లు పండుగ వాతావరణంలో వెల్లివిరిసింది. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పురవీధులన్నీ భక్తులతో కిటకిటలాడాయి.వేకువజాము నుండి అమ్మవారి చదును వద్దకు మహిళలు అధిక సంఖ్యలో చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామ పూజారులు అమ్మవారు ఘటాలను మేళ తాళాలు , డప్పు వాయిద్యాల మధ్య అంగరంగ వైభవంగా ఊరేగించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు మహిళలు ముగ్రాటలతో వేచి ఉండి అమ్మవారి ఘటాలకు మొక్కుల్లు చెల్లించారు. మహోత్సవాలలో భాగంగా కాళీ మాత వేషాలు ,అఘోరాలు ,కరీం నగర్ డప్పులు, బాణా సంచా ,రోషన్ లాల్ ఆర్కెస్ట్రా ,డాన్స్ షో వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఆద్యాత్మిక వెల్లువిరిసేలా సాంస్కృతిక కార్యక్రమాలను పండుగ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ఆమదాలవలస ఎమ్మెల్యే , రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ కూన రవికుమార్ ఆదేశాల మేరకు విద్యుత్ సమస్యలు , పారిశుద్ధ్య సమస్యలు , ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించారు. జిల్లా ,మండల విద్యుత్ శాఖ అధికారులు ఈ.ఈ పైడి యోగేశ్వర రావు , ,డిప్యూటీ ఈ.ఈ ఉప్పాడ రమణ మూర్తి ,ఏ.ఈ సుధీర్,జూనియర్ ఇంజనీర్ దుక్క రమణ మూర్తి ఎటువంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ,విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా అన్ని రకాల చర్యలు చేపట్టి అప్రమత్తంగా ఉన్నారు.ఆమదాలవలస సి. ఐ సత్యన్నారాయణ , పొందూరు ఎస్. ఐ సత్యన్నారాయణ ప్రత్యేక దృష్టి సారించి ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడిక్కడే వాహనాలను నిలుపుదల చేసేందుకు వివిధ స్థలాలలో పార్కింగ్ సదుపాయం కల్పించారు. ప్రజలకు ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. పండుగ ముగింపు లో భాగంగా వైభవంగా అమ్మవారి అనుపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు.

# సమస్యల వలయంలో దిగువ చిమిడిపల్లి గ్రామం.





సందర్శించిన అరకు ఇంచార్జ్ దొన్ను దొర.

**అనంతగిరి జూన్.18 ప్రజా జ్యోతి న్యూస్ రిపోర్టర్ శంకర్.** ల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం భీంపాలు పంచాయితీ దిగువ చిమిడిపల్లి గ్రామానికి రహదారి. మంచినీటి సౌకర్యం తోపాటు తదితర ముఖ్యమైన సదుపాయాలు గ్రామ ప్రజలకు లేకపోవడంతో ఎన్నో ఏళ్లుగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. త్రాగడానికి మంచినీటి సదుపాయం సక్రమంగా లేదు కలుషితమైన ఊట గేడ్డ నీరునే అన్ని అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు. ప్రభుత్వాలు మారిన మా తలరాతలు మారలేదని గ్రామ ప్రజలు నిరాశతో కుమిలిపోతున్నారు గ్రామ అవసరాలు.అభివృద్ధి పనుల నిర్మాణాల నిమిత్తం గత వైఎస్ఆర్ ప్రభుత్వంలో అనేకమార్లు ఫిర్యాదులు చేసిన ఫలితం లేకుండా పోయిందని గ్రామ ప్రజలు వాపోయిన సందర్భాలు ఉన్నాయి చిమిడిపల్లి గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ అరకు ఇంచార్జ్ దోన్ను దొర బుధవారం నాడు గ్రామాన్ని సందర్శించి స్థానిక ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వివరించిన ప్రజలు రహదారి.మంచినీటి సౌకర్యం గ్రామానికి కమ్యూనిటీ హాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలు మంజూరు చేయాలని కోరగా అధికారులతో మాట్లాడి గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దొరవెంట స్థానిక సర్పంచ్ బిమలమ్మ. మాజీ సర్పంచ్ ఈశ్వరరావు. టి.డి.పి ప్రధాన కార్యదర్శి భీమరాజు. బోర్రసర్పంచ్ అప్పారావు. మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బారావు. ఉపాధ్యక్షుడు జగన్ మండల క్లస్టర్ ఇంచార్జి బాబి.మండల నాయకులు శంకర్రావు. చిట్టిబాబు.పాడి నగేష్. అప్పలస్వామి గ్రామ పెద్దలుజన్ని లక్ష్మణ . ముక్కి రాంబాబు గర్వ కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు రైతులకు ఊరటనిచ్చే కలెక్టర్ నిర్ణయాలు

జిల్లాలో బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోళ్లకు శ్రీకారం ప్రభుత్వమే 25 మిలియన్ కేజీల కొనుగోలు





**బాపట్ల, జూన్18 ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్** బాపట్ల జిల్లాలో బ్లాక్ బర్లీ పొగాకు రైతులకు ఉత్సాహాన్నిచ్చేలా కలెక్టర్ జె వెంకట మురళి కీలక ప్రకటన చేశారు. గురువారం నుంచి పొగాకు కొనుగోళ్లను పునఃప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని ఈటిసి సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ, మార్క్ ఫెడ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు భరోసా కలిగించేందుకు ప్రభుత్వం ప్రతిస్థాయి ఆకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం "సీఎం యాప్"ను అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఈ యాప్ ద్వారా మాత్రమే కొనుగోళ్లు జరుగుతాయని తెలిపారు. ఇప్పటికే ఏపీ ఏఎంఎస్ లో నమోదైన రైతుల వివరాలను సీఎం యాప్‌కు అనుసంధానించాలన్నారు. పర్చూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలనే సూచనలతోపాటు, టోల్ ఫ్రీ నంబర్ కూడా అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. మార్క్ ఫెడ్ ద్వారా 25 మిలియన్ కేజీల బ్లాక్ బర్లీ పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. ఈ క్రమంలో హెచ్.డి.ఆర్, హెచ్.డి.ఎం రకాల కోసం క్వింటాకు 12,000, హెచ్.డి.ఎక్స్ రకం కోసం క్వింటాకు 6,000 ధర నిర్ణయించబడింది.ఈక్రాప్ నమోదు తక్కువగా ఉందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో 67,132 ఎకరాల్లో సాగు జరగగా కేవలం 50,513 ఎకరాలే ఈక్రాప్‌లో నమోదైందని, కేవలం 28,019 రైతులే నమోదు కావడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో తప్పుగా రికార్డింగ్ జరగవద్దని, తప్పు చేస్తే అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రభుత్వం అనే నినాదానికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. ఎందుకుగాను 300 కోట్ల నిధులు కేటాయించారని, ప్రభుత్వమే తొలిసారిగా పొగాకును నేరుగా కొనుగోలు చేస్తోందని తెలిపారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ, రైతుల పక్షాన ప్రభుత్వం నిలుస్తుందని తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా ప్రతి అధికారిని బాధ్యతతో పనిచేయించేందుకు పర్యవేక్షణ కొనసాగుతుందని చెప్పారు. రైతుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రక్రియలో స్థానిక ప్రజాప్రతినిధులుగా తాము పూర్తి సహకారం అందిస్తున్నామని సందర్భంగా తెలియజేశారు.ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, మార్క్ ఫెడ్ అధికారి కరుణశ్రీ, మార్కెటింగ్ శాఖ అధికారి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు

## దిగ్విజయంగా ముగిసిన పెంచలకోన పాదయాత్ర



**బద్వేల్ జూన్ 18 (ప్రజా జ్యోతి న్యూస్)** కడప జిల్లా గోపవరం మండలం వల్లెరవారిపల్లెలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధాన అర్చకులు పెంచలయ్య స్వామి ప్రజల సంక్షేమం కోసం, పాడిపంటల అభ్యున్నతి కోసం, లోక కళ్యాణం కోసం నిర్వహించిన పాదయాత్ర దిగ్విజంగా పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా బద్వేల్ పట్టణంలోని పద్మావతి మెడికల్ స్టోర్ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం, రైతుల అభ్యున్నతి కోసం చేపట్టిన పాదయాత్ర స్వయంభు లక్ష్మీనరసింహస్వామి కృప వల్ల దిగ్విజయంగా ముగిసిందని వారు పేర్కొన్నారు. దాదాపు రెండు రోజులపాటు 80 కిలోమీటర్లు మేర సాగిన ఈ పాదయాత్రలో దారిపొడవన పెంచల నరసింహస్వామి భక్తులు వచ్చి ప్రేమగా పలకరించి తాను చేస్తున్న పాదయాత్రకు పూర్తి సంఘీభావాన్ని తెలిపారని, అలాగే పెంచలకోన లో స్వామి దర్శనం ఎంతో ప్రశాంతంగా ఆహ్లాదకర వాతావరణంలో స్వామిని దర్శించుకోవడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి మొదలుపెట్టిన పాదయాత్ర ఇది ప్రతి ఏడాది కొనసాగుతూ ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెంచలయ్య స్వామి తో పాటు ఎర్రం రెడ్డి, సుబ్బరాజా తదితరులు పాల్గొన్నారు.

## వెల్దుర్తి మండలం బాలుర ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థులకు కిట్ల పంపిణీ



**(ప్రజా జ్యోతి రిపోర్టర్ ) 18-06-2025.** కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు బుధవారం నాడు టిడిపి మండల కన్వీనర్ టి. బలరాం గౌడ్, టిడిపి మండల యువ నాయకులు.బొమ్మన రమాకాంత్ రెడ్డి, ఎంఈఓ 2 సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకు అందజేశారు.

## అమ్మవారి పండుగ సేవలో యూనియన్ బ్యాంక్



**పొందూరు ,ప్రజాజ్యోతి న్యూస్:** ఎన్నో ఏళ్లు తర్వాత దిగ్విజయంగా నిర్వహిస్తున్న పొందూరు పైడితల్లి అమ్మవారి సేవలో పొందూరు బ్రాంచ్ యూనియన్ బ్యాంక్ సిబ్బంది తమ సేవలను అందించారు. సుదీర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో వాటర్ బాటిల్స్ పంపిణీ చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ హెడ్ శ్రీకాకుళం పైడి రాజా, పొందూరు బ్రాంచ్ హెడ్ జి బలరాం , సిబ్బంది జె సత్యన్నారాయణ , పి వెంకట రాం ,పి అసిరి నాయుడు , వై గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో సమస్యలను వెంటనే పరిష్కరించాలి

జూనియర్ కాలేజీ రోడ్డును సీసీ రోడ్డుగా వేయాలి

ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్






**కంచికచర్ల, జూన్ 18 (ప్రజాజ్యోతి)** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండల కమిటీ వారిచే కంచికచర్ల మండల పరిధిలోని ఎన్టీఆర్ జూనియర్ కాలేజీ రోడ్డును సీసీ రోడ్డు వేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్ మాట్లాడుతూ మండల పరిధిలోని ఎన్టీఆర్ జూనియర్ కాలేజీ సమస్యలు పరిష్కరించాలని ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని ఎన్టీఆర్ కాలేజీ రోడ్డును సీసీ రోడ్డు వేయాలని కంచికచర్ల మండలంలో పెండింగ్ లో ఉన్న నాడు నేడు పనులను పూర్తి చేయాలని,సంక్షేమ హాస్టల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్న కాస్మోటిక్ చార్జీలు ఇవ్వాలని మెస్ పెండింగ్ బిల్లులు ఇవ్వాలని.అలాగే పెండింగ్ లో ఉన్న ఫీజు రివర్స్మెంట్ విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు షేక్,ఖజు,ప్రేమ్ కుమార్,సాయి,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై దాడులు అత్యాచారాలు చేసే వారిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డిఓ కి ఏఐకేఎంఎస్ వినతి

**రుణాలు ఇచ్చి ఇబ్బంది పెడుతున్న వారి పైన చర్యలు తీసుకోవాలి**



**గుంతకల్లు జూన్ 18 (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలో ఇటీవల ఏదో ఒకచోట మహిళలపై అగత్యాలు, దాడులు జరుగుతున్నాయని, మహిళలపై దాడులు, అత్యాచారాలు,అగత్యాలు చేసే వారి పైన, రుణాలు ఇచ్చి మహిళల వేధిస్తున్న వడ్డీ వ్యాపారుల పైన రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బుధవారం అఖిలభారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ఆర్డిఓ కి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా సభ్యులు టి రామాంజనే యులు మాట్లాడుతూ అనంతపురంలో తన్మయి అనే అమ్మాయిని ప్రేమ పేరుతో మోసం చేసి పెళ్లి చేసుకుంటా నని నమ్మబలికి అమ్మాయిని కూడేరు మండలం బ్రాహ్మణ పల్లి దగ్గర అతి దారుణంగా బండరాయితో కొట్టి చంపడం జరిగింది .అదేవిధంగా సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడు గుర్రాల పల్లె లో 8వ తరగతి చదువుతున్న అమ్మాయిని గత రెండున్నర సంవత్సరము నుండి దాదాపు 18 మంది అగత్యం చేశారు. వారందరిని అరెస్టు చేయాలని చెప్పేసి చాలా రోజుల నుంచి డిమాండ్ చేస్తా ఉన్నాం. కొద్ది మందిని అరెస్టు చేశారు. మిగతా వారిని కూడా అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తా ఉన్నాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర ము దాటిపోయింది. అప్పటి నుండి ఏదో ఒకచోట మహిళల పై దాడులు జరుగుతున్నాయి కుప్పంలో నారాయణపురం గ్రామంలో భర్త ఆ గ్రామంలో 80 వేల రూపాయలు తీసుకొని కట్టలేక ఊరు విడిచి వెళ్లిపోయారు.అందుకు భార్యని చెట్టు కట్టేసి చిన్న పిల్లోడు ఏడుస్తున్నప్ప టికీ లెక్కచేయకుండా మహిళపై ముఖం మీద ఉమ్మి వేసి కొట్టి చంపుతామని బెదిరించడం జరిగింది. తక్షణమున వడ్డీ వ్యాపారస్తు లపై మరియు చర్యలు తీసుకోవాలని గతంలో కూడా సూక్ష్మ రుణాలు ఇచ్చి ప్రజలను ఇబ్బంది పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, మహిళలపై దాడులు వెంటనే ఆపాలని ఆర్డిఓ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని వినతి పత్రాన్ని ఇచ్చి కోరారు. లేని పక్షంలో బలమైన ఉద్యమాలు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు జక్కన్న,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం,రైతుల ప్రభుత్వం.

**గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయిపోయాయి, ఎక్కడ కూడా సబ్సిడీలు, వ్యవసాయ ఉపకరణ యంత్రాలు ఇచ్చిన దాఖలాలు లేవు.**







**కంచికచర్ల, జూన్ 18 (ప్రజాజ్యోతి)** కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయం నందు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం, కలెక్టర్ లక్ష్మీ షా, మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, వేల్పుల సునీత గ్రామ సర్పంచ్ మరియు కూటమి నేతలతో కలిసి వ్యవసాయ ఉపకరణ యంత్రాలను ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సౌమ్య బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కార్యక్రమం కంచికచర్లలో జరగటం కలెక్టర్ విచ్చేయడం చాలా సంతోషం. గత ఐదేళ్ల వైసిపి పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయిపోయాయి. కూటమి ప్రభుత్వం రాగానే సంవత్సర కాలంలోనే అన్ని వ్యవస్థలను ఒక తాటిపై తీసుకు వస్తున్న సిఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా మణులు తల్లికి వందనం నగదు తల్లుల ఖాతాకు జమ కావడంతో చాలా సంతోషంగా ఉన్నారు. చెప్పిన హామీను నెరవేర్చినందుకు నారా లోకేష్ కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ రోజు నుంచి వ్యవసాయ యంత్రాంగాలు సబ్సిడీలు మరల పునరుద్ధరించడంతో రైతన్నలు కూడా సంతోషంగా ఉండబోతున్నారు. సూపర్ సిక్స్ హామీల లో భాగంగా ఈ నెల చివరిలోపు రైతు భరోసా కూడా నెరవేరనుంది. నందిగామలో 67 లక్షల రూపాయల విలువ కలిగిన 126 పరికరాలను 38 లక్షల రూపాయల సబ్సిడీతో రైతన్నలకు అందజేయడం జరిగినది. ఇందులో రోటవేటర్స్,కల్టివేటర్స్ ఆధునిక వ్యవసాయం చేయడానికి అధునాతనంగా డ్రోన్స్ అందజేయడం జరిగినది. దీని ద్వారా స్ప్రే చేసే విధానం దృశ్య రూపంలో రైతన్నలకు చూపించడం జరిగినది. రానున్న రోజులలో వ్యవసాయ క్షేత్రంలో అధునాతన మార్పులు జరిగి అతి తక్కువ సమయంలో ఎక్కువ లబ్ధి చేకూరే విధంగా రైతన్నలకు భరోసాగా కూటమి ప్రభుత్వం చేసే ప్రణాళికలు ఉండబోతున్నాయి దీని ద్వారా రైతన్నలకు లబ్ధి చేకూరానున్నదని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న సన్నకారు రైతులకు ప్రభుత్వం నుంచి మద్దతు

**రాయితీతో వ్యవసాయ పరికరాల పంపిణీ**

**చిన్న సన్నకారు రైతులకు 2 కోట్ల 10 లక్షల చెక్కుల పంపిణీ**

**కలెక్టర్ జె. వెంకట మురళి**




**బాపట్ల జూన్18 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** చిన్న సన్నకారు రైతుల వ్యక్తిగత వ్యవసాయ పరికరాల సరఫరాలో 50 శాతం రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం అందిస్తోందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్.ఎస్ హాలులో చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాల్లో రాయితీపై వ్యవసాయ పరికరాలు పొందనివారికే ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫామ్ మెకనైజేషన్,అగ్రికల్చర్ మెకనైజేషన్ కార్యక్రమాల కింద కర్షక్ పోర్టల్ ఆధారంగా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి యంత్రాలు పంపిణీ చేస్తోందని వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 1,061 మంది రైతులకు వివిధ రకాల వ్యవసాయ పరికరాలను అందజేశామని తెలిపారు. వీరిలో 577 మందికి ట్రాక్టర్‌తో నడిచే యంత్రాలు, 42 మందికి రోటవేటర్లు, 51 మందికి బ్యాటరీ స్ప్రేయర్లు, 374 మందికి పవర్ స్ప్రేయర్లు, 5 మందికి ట్రాక్టర్ స్ప్రేయర్లు, 3 మందికి పవర్ వీడర్లు, 4 మందికి బ్రష్ కట్టర్లు, 5 మందికి పవర్ టిల్లర్లు అందించబడ్డాయి. వీటి సరఫరా ఆగ్రో సంస్థ ద్వారా జరిగినదని చెప్పారు. ఈ పరికరాలకు ప్రభుత్వం మొత్తం 2 కోట్లు 10 లక్షల 2 వేల 358 రూపాయల రాయితీ అందించిందని కలెక్టర్ వివరించారు. కొన్ని కుటుంబాలకు తైవాన్ స్ప్రేయర్లను కూడా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు రామకృష్ణ, సహాయ సంచాలకులు లక్ష్మి, బాపట్ల వ్యవసాయ అధికారి శారద తదితరులు పాల్గొన్నారు.

## యోగ కార్యక్రమంలో పాల్గొన్న యువనేత రితేష్ రెడ్డి



**బద్వేల్ జూన్ 18 (ప్రజా జ్యోతి న్యూస్)** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మరియు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు యోగాంధ్ర 2025 లో భాగంగా బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ రితేష్ రెడ్డి, బద్వేల్ రెవిన్యూ డివిజన్ అధికారి చంద్రమోహన్, మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి గారు ఎస్ బి వి ఆర్ కళాశాల ప్రాంగణంలో యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా అనేది ఒక వ్యక్తి తన శరీరానికి, మనసుకు మరియు ఆత్మకు సంబంధించిన సమతుల్యతను సాధించడం జరుగుతుందన్నారు. మానసిక ,శారీరక ఆనందం పొందడంతో పాటు శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక శ్రేయస్సును పెంపొందించడానికి సహాయపడుతుందన్నారు. ఒత్తిడిని తగ్గించడానికి మానసిక స్పష్టతను పెంచడానికి తోడ్పడుతున్నారు. అనంతరం ఈ నెల 21వ తారీఖు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యస్ బి.వి. ఆర్ కళాశాల ప్రాంగణం నందు యోగా కార్యక్రమం నిర్వహణ కొరకు మైదానమును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యస్ బి.వి. ఆర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకట సుబ్బారెడ్డి, యోగా ట్రైనర్ అమర్నాథ్ రెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఏవోను కలిసిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి. నాగేంద్ర



**ప్రజా జ్యోతి తుగ్గలి** కర్నూల్ కలెక్టరేట్ ఏవో గా బాధ్యతలు స్వీకరించిన శివరాముడు ను వీఆర్వోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సి. నాగేంద్ర బుధవారం రాత్రి మర్యాద పూర్వకంగా కర్నూల్ కలెక్టరేట్లో కలిశారు. ఈ సందర్భంగా ఏవో శివరాముడును శాలువా పూలమాలతో ఆయన సత్కరించారు. జిల్లాలో ఉండే రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను, వీఆర్వోల సమస్యలను పరిష్కరించాలని తెలియజేసినట్లు తెలిపారు. అందుకు సానుకూలంగా ఏవో శివరాముడు రెవెన్యూ ఉద్యోగుల, విఆర్వోల సమస్యల పరిష్కరిస్తామని తెలియజేసినట్లు వీఆర్వోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సి. నాగేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూరి బాబు, కోశాధికారి సోమన్న మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

## నూతన ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్ రెడ్డి



**తాళ్లపూడి, జూన్ 18, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం నూతన ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించిన వేణుగోపాల్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఎంపీపీ జొన్నకూటి పోసిరాజును మర్యాద పూర్వకంగా కలవడం జరిగిందని అన్నారు. మండలంలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పలు అభివృద్ధి పథకాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. సాధారణ బదిలీల్లో భాగంగా దేవరపల్లి నుండి తాళ్లపూడి మండలానికి వచ్చినట్లు తెలిపారు. ఇప్పటివరకు మండల ఎంపీడీవో గా విధులు నిర్వహించిన టిబివి. రమణ కొవ్వూరు కు బదిలీ అయినట్లు తెలిపారు

# ఏడు డ్రెజ్జింగ్ బోట్స్ ను సీజ్ చేసిన అధికారులు



**తాళ్లపూడి,జూన్18, ప్రజాజ్యోతి న్యూస్** తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాళ్లపూడి గ్రామంలో డిసిల్టేషన్ పాయింట్ వద్ద అక్రమంగా డ్రెజ్జింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న బోట్స్ మ్యాన్ సొసైటీ సభ్యులు సమాచారం రావడంతో ఆకస్మిక తనిఖీ చేసిన అధికారులు ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశాలు మేరకు జిల్లాలో ప్రస్తుతం ఇసుక త్రవ్వకాల కార్యకలాపాలు పై నిషేధం అమలు లో ఉందని అనధికారికంగా డ్రెజ్జింగ్ నిర్వహిస్తున్న బోట్స్ మ్యాన్ సొసైటీ సభ్యులు వారి వద్ద నుండి ఏడు డ్రిజ్జింగ్ బోట్స్ ను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు ఈ దాడుల్లో పాల్గొన్న జిల్లా మైన్స్ అధికారి డి ఫణి భూషణ్ రెడ్డి, తహసిల్దార్ లక్ష్మీ లావణ్య, టాస్క్ ఫోర్స్ ఎస్ ఐ ఆంజనేయులు, ఇరిగేషన్ శాఖ ఏ ఈ మణికంఠ ఉన్నారు

# ఈవీఎం గోదాము తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**సీసీ కెమెరాలు, భద్రతా ఏర్పాట్లపై సమీక్ష**




**బాపట్ల జూన్18 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** త్రైమాసిక సాధారణ తనిఖీలలో భాగంగా బుధవారం బాపట్లలోని ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి పరిశీలించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో ఏర్పాటు చేసిన ఈవీఎం గోదాములో భద్రపరిచిన ఈవీఎంలు, వివిపాట్ యంత్రాల నియోజకవర్గాల వారీగా భద్రతా ఏర్పాట్లను ఆయన సమీక్షించారు .గోదాములోని సీసీ కెమెరాల పనితీరును కలెక్టర్ పరిశీలించి, పర్యవేక్షణ వ్యవస్థలో ఎటువంటి లోపాలు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. సందర్శన రిజిస్టర్, పోలీసు భద్రత పర్యవేక్షణ అంశాలపై ఆరా తీశారు. 24 గంటల పోలీసు నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ వెంట జిల్లా రెవిన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డిఓ పి. గ్లోరియా, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు బీజేపీ రామకృష్ణ, కాంగ్రెస్ డి. రవి, బీఎస్పీ జి. రాజారావు, సీపీఎం కె. శరత్, ఆప్ నాయకుడు బాలాజీ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఐ. మాల్యాద్రి, తహసిల్దార్ సలీమా, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కమిషన్ చైర్మన్ ను మర్యాద పూర్వకంగా కలిసిన మాదిగ కార్పొరేషన్ చైర్మన్



**తాళ్లపూడి,జూన్18, ప్రజా జ్యోతి న్యూస్** లఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సి కమిషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన కె.ఎస్ జవహర్ ను బుధవారం విజయవాడ ఎస్సి కమిషన్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీ దేవి ఈ సందర్భంగా దళితుల అభివృద్ధి కొరకు ఏ విధంగా కృషి చేయాలి అనే అంశంపై కొద్దిసేపు ఇరువురు చర్చించు కోవడం జరిగింది ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు

## ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకము అర్హుడైన లబ్ధిదారుడికి అందేలా చూడాలి ఎమ్మెల్యే ముప్పిడి




**తాళ్లపూడి, జూన్ 18, ప్రజాజ్యోతి న్యూస్** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పోసిరాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. సర్వసభ్య సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యంగా రైతులు, తల్లికి వందనం, అలాగే గ్రామాలలో నీటి సదుపాయం, డ్వాక్రా మహిళల రుణాలు ఇతర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# మహిళలపై దాడులు అత్యాచారాలు చేసే వారిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డిఓ కి ఏఐకేఎంఎస్ వినతి

**రుణాలు ఇచ్చి ఇబ్బంది పెడుతున్న వారి పైన చర్యలు తీసుకోవాలి**



**గుంతకల్లు జూన్ 18 (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలో ఇటీవల ఏదో ఒకచోట మహిళలపై అగత్యాలు, దాడులు జరుగుతున్నాయని, మహిళలపై దాడులు, అత్యాచారాలు,అగత్యాలు చేసే వారి పైన, రుణాలు ఇచ్చి మహిళల వేధిస్తున్న వడ్డీ వ్యాపారుల పైన రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బుధవారం అఖిలభారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ఆర్డిఓ కి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా సభ్యులు టి రామాంజనే యులు మాట్లాడుతూ అనంతపురంలో తన్మయి అనే అమ్మాయిని ప్రేమ పేరుతో మోసం చేసి పెళ్లి చేసుకుంటా నని నమ్మబలికి అమ్మాయిని కూడేరు మండలం బ్రాహ్మణ పల్లి దగ్గర అతి దారుణంగా బండరాయితో కొట్టి చంపడం జరిగింది. అదేవిధంగా సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడు గుర్రాల పల్లె లో 8వ తరగతి చదువుతున్న అమ్మాయిని గత రెండున్నర సంవత్సరము నుండి దాదాపు 18 మంది అగత్యం చేశారు. వారందరిని అరెస్టు చేయాలని చెప్పేసి చాలా రోజుల నుంచి డిమాండ్ చేస్తా ఉన్నాం. కొద్ది మందిని అరెస్టు చేశారు. మిగతా వారిని కూడా అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తా ఉన్నాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర ము దాటిపోయింది. అప్పటి నుండి ఏదో ఒకచోట మహిళల పై దాడులు జరుగుతున్నాయి కుప్పంలో నారాయణపురం గ్రామంలో భర్త ఆ గ్రామంలో 80 వేల రూపాయలు తీసుకొని కట్టలేక ఊరు విడిచి వెళ్లిపోయారు.అందుకు భార్యని చెట్టు కట్టేసి చిన్న పిల్లోడు ఏడుస్తున్నప్ప టికీ లెక్కచేయకుండా మహిళపై ముఖం మీద ఉమ్మి వేసి కొట్టి చంపుతామని బెదిరించడం జరిగింది. తక్షణమున వడ్డీ వ్యాపారస్తు లపై మరియు చర్యలు తీసుకోవాలని గతంలో కూడా సూక్ష్మ రుణాలు ఇచ్చి ప్రజలను ఇబ్బంది పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, మహిళలపై దాడులు వెంటనే ఆపాలని ఆర్డిఓ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని వినతి పత్రాన్ని ఇచ్చి కోరారు. లేని పక్షంలో బలమైన ఉద్యమాలు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు జక్కన్న,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న నారాయణ,భాష్యం విద్యా సంస్థలను వెంటనే సీజ్ చేయాలి

ఏబీవీపీ



**గుంతకల్లు జూన్ 18 (ప్రజా జ్యోతి):** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న నారాయణ, భాష్యం విద్యా సంస్థలను వెంటనే సీజ్ చేయాలని ఏబీవీపీ అనంతపురం జిల్లా కన్వీనర్ శివరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఉన్న నారాయణ జూనియర్ కాలేజ్, మరియు భాష్యం స్కూల్ నిబంధనలకు విరుద్ధంగా కళాశాల, స్కూల్ ఆవరణంలో పుస్తకాల, యూనిఫామ్ పేరుతో వస్త్రాల వ్యాపారాన్ని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శివరాజ్ ఆధ్వర్యంలో అడ్డుకోవడం జరిగింది.ఈ సందర్భంగా శివరాజ్ మాట్లాడుతూ విద్యార్థుల నుండి వచ్చేటువంటి పైసలకు ఆశపడి ఈ విధంగా పుస్తకా లు,వస్త్రాలు వ్యాపారం చేస్తూ నారాయణ,భాష్యం అంటే ఈరోజు వ్యాపార కేంద్రాలుగా మార్చేటువంటి దౌర్భాగ్య స్థితి నారాయణ,భాష్యం విద్యా సంస్థలకు ఏర్పడిందని ఇది సిగ్గుచేటు అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న నారాయణ, భాష్యం విద్యాసంస్థలపై,ఇతర విద్యా సంస్థలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏబీవీపీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ గుంతకల్లు నగర సహాయ కార్యదర్శి వంశీ,కళ్యాణ్ కుమార్,నగర ఉపాధ్యక్షులు వసీంఖాన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ

**కోడిగుడ్ల సరఫరా చేసే కాంట్రాక్టర్‌కు నోటీసులు**



**పాతపట్నం జూన్ 18, ప్రజాజ్యోతి** పాతపట్నం మండలం ప్రహరాజపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్ళిన గుడ్లు పంపిణీ వార్త పై అధికారులు స్పందించారు. బుధవారం పాతపట్నం మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను అంగన్‌వాడీ అధికారిని తనిఖీలు చేపట్టారు. ప్రహరాజపాలెం అంగన్‌వాడీ కేంద్రంకు అలాగే మండలంలోని మరో కేంద్రంకు కుళ్ళిన కోడిగుడ్లు సరఫరా చేసిన కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చారు.

## సాయి హాస్పిటల్‌లో మొదటి ప్రసవానికి ప్రత్యేక సన్మానం



**బాపట్ల జూన్ 18 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల నియోజకవర్గం పిట్టలవానిపాలెంలో నూతనంగా ప్రారంభమైన సాయి ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో తొలి ప్రసవం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా బాపట్ల ఎమ్మెల్యే తల్లి–శిశువును పరామర్శించారు. మొదటి ప్రసవంగా జ్ఞాపకార్థంగా కొత్తగా ప్రసవించిన తల్లికి సర్టిఫికెట్‌ను ఆయన చేతుల మీదగా అందజేశారు. జిల్లా ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించే లక్ష్యంతో ఈ ఆసుపత్రి పనిచేయాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి రావడం సంతోషకరమని అన్నారు. ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు. స్థానిక ప్రజలు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు

## చింతయపాలెం జడ్పీ హైస్కూల్లో శక్తి యాప్ పై అవగాహన

**విద్యార్థినులకు రక్షణగా శక్తి యాప్ వినియోగం అధికారుల వివరణ**




**బాపట్ల జూన్18 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** జిల్లా ఎస్పీ తుషార్ దూడీ ఆదేశాలతో కర్లపాలెం మండలం చింతయపాలెం జడ్పీ హైస్కూల్లో శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా అధికారి అనిత విద్యార్థినీలకు శక్తి యాప్ వినియోగం, అందులోని సేవల గురించి వివరించారు.శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచంగా ఉపయోగపడుతుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో శీఘ్ర పోలీసు సహాయం అందించేందుకు ఇది ఉపయుక్తమని తెలిపారు. ప్రతి విద్యార్థిని తన మొబైల్‌లో శక్తి యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. మహిళల భద్రత కోసం శక్తి వాట్సాప్ నంబర్ 79934 85111 అందుబాటులో ఉందని, వీడియో కాల్, లేదా కాల్ సందేశం ద్వారా మహిళలు సాయం కోరవచ్చన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి తక్షణ స్పందన ఉంటుందని మహిళా శక్తి బృందం అధికారి అనిత తెలియజేశారు ఈ కార్యక్రమంలో శక్తి బృందం అధికారులు స్కూల్ హెచ్ఎం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పతి ముర్ము చే అభినందనలు అందుకున్న ఎల్, చాందిని..





**పాతపట్నం, జూన్ 18 ప్రజా జ్యోతి న్యూస్** పాతపట్నం మండలం, రొంపివలస హైస్కూల్ విద్యార్థి ని ఎల్, చాందిని టీ ఎల్ సి వారు జాతీయ స్థాయి లో ప్లెస్టిక్ పొల్యూషన్ రెమెడీస్ బ్యాడింగ్ మోడరన్ ఇండియా ఈజీ కంపిటేషన్ లో జూనియర్ విభాగం లో మొదటి స్థానం కైవసం చేసుకున్న విజేత చాందిని. ఇ నేపథ్యంలో న్యూడిల్లి లో రాష్ట్రపతి ముర్ము తో అభినందనలు అందుకుంది. రాష్ట్రపతి భవన్ లో ఫోటో దిగింది ,విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# భూ సమస్యల పై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషి

**జగిత్యాల :** రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు.శుక్రవారం మేడిపల్లి మండలంలోని కట్లకుంట గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఫీల్డ్ విచారణ పూర్తి చేసే పరిష్కరించాలని అన్నారు. వచ్చిన దరఖాస్తులలో విచారణ పూర్తయిన వాటిని వెంటనే ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు.రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు వాటి పూర్తి వివరాలు తీసుకోవాలని, భూ భారతి చట్ట ప్రకారం వాటి పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని అన్నారు.ఆంతకుముందు మేడిపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు.ఈ సంధర్భంగా పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులతో మాట్లాడారు పాఠ్యాంశం బోధన (ఐఎఫ్టీ) ఇంటర్ యాక్ట్ ప్లాంట్ ప్యానల్ ద్వారా విద్యార్థులకు బోధించేటప్పుడు తరగతి గదిలో విద్యార్థులతో కూర్చొని జిల్లా కలెక్టర్ విద్యా బోధన ను గమనించారు .పాఠశాల విషయాల గురించి విద్యార్థులను, ఉపాధ్యాయులకు అడిగి తెలుసుకున్నారు.వంటగది సామాగ్రి పప్పు దినుసులు వంట నూనె సంబంధించినవి నాణ్యత పరిమాణాలతో ఉండాలని, పిల్లలకు మంచి భోజనం అందించాలి సూచించారు.. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నీరు నిలువ ఉండకుండా చూడాలని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలని పాఠశాల ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఈవో రామ్, కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి,తహసిల్దార్ మునీందర్,ఎంపీడీవో పద్మావతి,సంబంధిత అధికారులు, రైతులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాధి ముబారక్ సీఎంఆర్ చెక్కులు పంపిణీ

**కోరుట్ల :** పట్టణంలోని కల్లూర్ రోడ్డు లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం పట్టణ, మండలానికి సంబంధించిన 1 కోటి 7 లక్షల 12 వేల 412 రూపాయల విలువ గల 107 కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కలను ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.. అలాగే పట్టణ, మండలానికి చెందిన 10 లక్షల 54 వేల రూపాయల విలువగల 37 ముఖ్యమంత్రి సహా నిధి చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు..అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోటి దురద అరాచకాల వల్ల రాష్ట్రంలో ఆదాయం తగ్గిందన్నారు.. 2014 ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాడు నెలకు 4వేల కోట్ల ఉన్న ఆదాయాన్ని భారత రాష్ట్ర సమితి పార్టీ అట్టి ఆదాయాన్ని 18 వేల కోట్లకు వచ్చిందని మళ్లీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఆదాయం తగ్గిందని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలన్నీ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశ పెట్టినవేమన్నారు.. కానీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకపోవడం చాలా బాధాకం`మన్నారు.. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దారిశెట్టి రాజేష్, జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు చీటీ వెంకట్రావు, నాయకులు ఫహీం,హాఫీజ్, భాస్కర్ రెడ్డి, ఖయ్యుం, అంజయ్య, సందయ్య, నాయకులు, కార్యకర్తలు, కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిది లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

## నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఎదగాలి

**జగిత్యాల :** విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుపుచ్చుకొని జీవితంలో ఉన్నత స్థానం సాధించాలని ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాసరెడ్డి అన్నారు. వాల్మీకి ఆవాసం సేవా భారతి ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో రెండవ బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యశస్వి ఎంటర్ప్రైజెస్ అధినేత కోటగిరి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ రంగు గోపాల్ హాజరుకాగా ప్రధాన వక్తగా డాక్టర్ ఆకుతోట శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ సేవా విభాగం సేవా భారతి ద్వారా దేశవ్యాప్తంగా 1,70,000 సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. వాల్మీకి ఆవాసం ద్వారా ఉచిత ట్యూషన్ సెంటర్లు, బాల సంస్కార కేంద్రాలు, కుట్టు శిక్షణ కేంద్రం తో పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణను అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికి ఉద్యోగాలు కల్పించడం ఏ ప్రభుత్వం వల్ల కూడా సాధ్యం కాదని యువత తమ నైపుణ్యాలను పెంచుకొని స్వయం ఉపాధి కోసం ప్రయత్నించాలన్నారు.

## నీతి వ్యాఖ్యలు వల్లిస్తున్న కేటీఆర్.. తిట్టుకుంటున్న ముసలివాళ్ళు

**హైదరాబాద్ :** నీతి వ్యాఖ్యలు వల్లిస్తున్న కేటీఆర్ ను చూసి భార్య భర్తల ఫోన్లు ఎలా వింటాడని కేటీఆర్ ను 65 ఏండ్ల ముసలివాళ్ళు తిడుతున్నారని ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ విమర్శించారు. బుదవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ తెలంగాణ ప్రజల పరువు బజారున పడేసినందుకు కల్వకుంట్ల కుటుం బానికి నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేవ్సారు.

## జిల్లా పోలీసులకు యోగా సాధన

**ఒత్తిడి నివారణకు యోగా ఎంతో దోహద**

**ఎస్పీ తుషార్ దూడి**




**బాపట్ల జూన్18 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం బాపట్ల పోలీస్ కవాతు మైదానంలో జిల్లా పోలీసులకు యోగా సాధన కార్యక్రమం నిర్వహించబడింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "యోగాంధ్ర" ఉత్సవాలలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో యోగా గురువు ధూళిపాల శైలజ నేతృత్వంలో 32 రకాల యోగాసనాలు, సూర్యనమస్కారాలు చేయించబడాయి. ఈ కార్యక్రమంలో బాపట్ల, చీరాల, రేపల్లె సబ్ డివిజన్ ల పోలీస్ సిబ్బందితో పాటు ఏఆర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ దూడి మాట్లాడుతూ జిల్లా పోలీసుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చే దిశగా యోగా ఎంతో ఉపయోగకరమని తెలిపారు ప్రతిరోజూ కొంత సమయం యోగా సాధనకు కేటాయించాలన్నారు. పోలీస్ విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించేందుకు యోగా ఉత్తమ మార్గమని చెప్పారు ఆరోగ్యవంతమైన శరీరం, ప్రశాంతమైన మనస్సుతోనే ఉత్తమ సేవలు అందించగలం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మౌలుద్దిన్, ఆర్ఎస్ఐ కళ్యాణ్, యోగా మాస్టర్ ట్రైనర్లు గురజాల శ్రీనివాసరావు, కర్పూరపు మంజులత, తల్లి కొండ కృష్ణారావు, ఎం. సూరిబాబు, బాజీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# కన్నప్పతో ఎంట్రీ... జీవితంలో మరిచిపోలేని జ్ఞాపకం!




మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న చిత్రం కన్నప్ప. ఈ సినిమాకు ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న కన్నప్ప జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. ఇప్పటికే ట్రైలర్ రిలీజ్ కాగా.. ఆడియన్స్‌లో అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. రిలీజ్ తేదీ దగ్గర పడడంతో మేకర్స్ ప్రమోషన్స్ ప్రారంభించారు. తాజాగా మంచు విష్ణు తన కుమారుడి వీడియోను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. తన కుమారుడు అవ్రామ్ కన్నప్ప మూవీతో అరంగేట్రం చేయడం సంతోషంగా ఉందంటూ మంచు విష్ణు సోషల్ మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. తను సెట్‌లోకి రావడం, మాటలు చెప్పడం, ఈ డ్రీమ్ ప్రాజెక్ట్‌లో నటించడం నా జీవితంలో అత్యంత భావోద్వేగ క్షణాల్లో ఒకటని తెలిపారు. ఒక తండ్రిగా నేను ఒకప్పుడు కలలు కన్న అదే ఆకాశం కింద మన బిడ్డ ప్రకాశించడం చూస్తే అంతకు మించింది ఏదీ ఉండదు..ఇది కేవలం అరంగేట్రం కాదు. ఇది జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకమని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. మీరు ఎల్లప్పుడూ నాకు ఇచ్చిన అదే ప్రేమ, ఆశీర్వాదాలతో మీరందరూ నా కుమారుడిపై కూడా చూపిస్తారని నేను ఆశిస్తున్నా.. అవ్రమ్ ప్రయాణం ప్రారంభం.. అది కన్నప్పతో మొదలు కావడం చాలా సంతోషంగా ఉందంటూ మంచు విష్ణు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాగా.. కన్నప్పలో రెబల్ స్టార్ ప్రభాస్ కూడా నటించారు. ట్వంటీ ఫోర్ ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్టైన్మెంట్ బ్యానర్లపై మోహన్ బాబు నిర్మించారు. ఈ సినిమాలో మోహన్ బాబు, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్ లాంటి అగ్రతారలు నటించారు. వీరితో పాటు అర్పిత్ రాంకా, బ్రహ్మానందం, సప్తగిరి, ముఖేష్ రిషి, మధుబాల, ఐశ్వర్య భాస్కరన్, బ్రహ్మాజీ, దేవరాజ్, రఘు బాబు, శివ బాలాజీ కీలక పాత్రల్లో మెప్పించారు. కాగా.. ఈ సినిమాను ఇటీవలే సూపర్ స్టార్ రజినీకాంత్ వీక్షించారు. అద్భుతంగా ఉందంటూ కొనియాడారు.




# 'హరిహర వీరమల్లు'కి పోటీగా వస్తున్న విజయ్ 'కింగ్‌డమ్'.!

రౌడీ హీరో విజయ్ దేవరకొండ కథానాయకుడిగా వస్తున్న తాజా చిత్రం కింగ్‌డమ్. ఈ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మిస్తున్నాడు. గత నెల మే 30న విడుదల కావాల్సి ఉన్న ఈ చిత్రం పలు కారణాల వలన వాయిదా పడుతూ వస్తున్న విషయం తెలిసిందే. ఫస్ట్ టైం పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు వస్తుదంటూ పోస్ట్ పోన్ చేసుకున్నారు మేకర్స్ కానీ.. ఈ తేదీకి వీరమల్లు కూడా రాకపోవడంతో తేదీ వృధాగా పోయింది. ఆ తర్వాత ఇండియా పాకిస్థాన్ మధ్య పరిస్థితులు సరిగ్గా లేకపోవడంతో ఈ సినిమాను జూలై 04న తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు. అయితే ఈ తేదీ కూడా క్యాన్సిల్ అవ్వడంతో తాజాగా మరో డేట్ ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. ఈ సినిమాను జూలై 25న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు సమాచారం. అయితే కింగ్‌డమ్ వచ్చే కంటే ఒకరోజే ముందే వీరమల్లు రాబోతుంది. హరిహర వీరమల్లుని జూలై 24న విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే రెండు సినిమాలకు గట్టి పోటి ఉండబోతుందని సమాచారం. కింగ్‌డమ్ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ మూవీలో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నది. సత్యదేవ్ కీలకపాత్రలో నటిస్తున్నాడు. అనిరుధ్ రవిచంద్ర మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్‌ను హైదరాబాద్, విశాఖపట్నం, కేరళ, శ్రీలంకలో చిత్రీకరించినట్లు సమాచారం.

# కీరవాణి నుంచి భీమ్స్ చేతికి విశ్వంభర?




తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియన్ మూవీలలో విశ్వంభర ఒకటి. అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తుండగా.. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ పనుల్లో బిజీగా గడుపుతుంది. సినిమా టీజర్‌పై విపరీతంగా ట్రోల్స్ రావడంతో గ్రాఫిక్స్‌పై మరింత కష్టపడుతున్నారు మేకర్స్. అయితే ఈ సినిమాలో స్పెషల్ సాంగ్‌కి సంబంధించి ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాకు సంబంధించి షూటింగ్ పరంగా ప్రస్తుతం స్పెషల్ సాంగ్ ఒక్కటే బ్యాలన్స్ ఉందని సమాచారం. అయితే ఈ సాంగ్ ఇంకా ఒకే కాలేదని.. కీరవాణి సంగీతం అందించిన సాంగ్ చిరుకి నచ్చలేదని.. అందుకే.. కొత్త సంగీత దర్శకుడు భీమ్స్‌తో చిత్రయూనిట్ సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి చిత్రబృందం అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోవైపు అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరు ఒక సినిమా చేస్తున్నాడు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతుంది. సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్నారు.



# వెండిమబ్బులలో అందాల జాబిలమ్మ

తెలుగు సినీరంగంలో హిట్స్ అందుకున్నప్పటికీ అవకాశాలు అందుకోని హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్. ఈ అమ్మడు నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అయ్యాయి. కానీ ఇప్పటికీ ఈ బ్యూటీకి సరైన ఆఫర్స్ రాలేదు. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ సందడి చేస్తుంది. తెలుగులో తొలి చిత్రంతోనే నటిగా ప్రశంసలు అందుకుంది ప్రగ్యా జైస్వాల్. అందం, అద్భుతమైన నటనతో ప్రేక్షకులను కట్టిపడేసిన ప్రగ్యా.. ఇప్పటివరకు సరైన బ్రేక్ అందుకోలేదు. అంతేకాదు.. స్టార్ హీరోల సరసన నటించినప్పటికీ ఈ బ్యూటీకి అంతగా క్రేజ్ రాలేదు. తెలుగులో పలు చిత్రాల్లో నటించి మెప్పించింది. టాలీవుడ్ ఇండస్ట్రీలో యంగ్ హీరోలతోపాటు పలువురు స్టార్స్ సరసన నటించిన ప్రగ్యా.. ఇప్పుడు ఇండస్ట్రీలో సైలెంట్ అయ్యింది. తాజాగా ఆమె ఉత్తమ నటిగా గద్దర్ అవార్డ్ అందుకుంది. వరుణ్ తేజ్ హీరోగా వచ్చిన కంచె సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఈ సినిమాలో అద్భుతమైన నటనతో కట్టిపడేసింది. కంచె సినిమాలో తన నటనకుగానూ ఉత్తమ నటిగా గద్దర్ అవార్డ్ అందుకుంది. అలాగే బాలకృష్ణ నటించిన అఖండ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ మూవీతో తన నటనకు ప్రశంసలు అందుకుంది. ఈ సినిమా తర్వాత వరుసగా అవకాశాలు వస్తాయి అనుకున్నారు. కానీ ఆ అదృష్టం ఆమెకు కలిసిరాలేదు. ఈ సినిమా తర్వాత ప్రగ్యాకు అంతగా ఆఫర్స్ అంతగా రాలేదు. ప్రస్తుతం బాలయ్య నటిస్తోన్న అఖండ సీక్వెల్ అఖండ 2లో నటిస్తుంది. అలాగే సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. తాజాగా ఆమె సిల్వర్ చీరలో అందమైన జాబిలమ్మగా మెరిసిపోతుంది. వెండిమబ్బులలో మెరిసిన వెన్నెలమ్మగా కనిపిస్తుంది. ప్రగ్యా జైస్వాల్.. మధ్యప్రదేశ్ లోని జబల్ పూర్ లో జన్మించింది. పూణేలోని సింబయాసిస్ లా స్కూల్లో చదివింది. సింబయాసిస్ యూనివర్సిటీలో చదువుతున్న రోజుల్లోనే అందాల పోటీలలో పాల్గొంది. మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ప్రగ్యా జైస్వాల్ ఫెమినా మిస్ ఇండ్షియ 2008లో పోటీల్లో పాల్గొని మిస్ ఫ్రెష్ ఫేస్ టైటిల్ గెలుచుకుంది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com